ప్రజాశక్తి

బుధవారం 26 మార్చి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఆ డిపాజిట్లు ఏమైనట్లు?

- ఖాతాలో రూ.300 కోట్లు ఖాళీ?
- రైతుల డబ్బు ట్రస్టుకు మళ్లింపు
- ఇష్టానుసారం ఖర్చు
- జవాబుదారీతనంలేని విశాఖ డెయిరీ పాలకవర్గం
- సొంత సంపాదనపైనే వారి దృష్టంతా

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

విశాఖ డెయిరీ పాలకవర్గానికి జవాబుదారీతనం లేకుండా పోయింది. రైతు ఇలాగే మౌనంగా ఉంటే డెయిరీని తినేసే ప్రమాదముంది. అడిగిన వారికి ఆదాయ మార్గం చూపించి, పాల రైతు సొమ్ము ఎంతో కాలంగా తినడానికి అలవాటు పడింది. సహకార డెయిరీగా ఉన్నకాలంలో సమకూర్చుకున్న ఆస్తులను కంపెనీ యాక్టు కిందకు వచ్చాక పాలకవర్గ సభ్యులు ఒంటి చేతితో నడిపిస్తున్నారు. పాలు పోసే రైతులు బాగుపడలేదుగానీ, డెయిరీ చైర్మన్, డైరెక్టర్లు రూ.కోట్లకు అధిపతులయ్యారు. డెయిరీ వ్యాపార, వ్యవహారాలను తమ గుప్పెట్లో పెట్టుకొని లాభాలు పోగేసుకొని భోగాలు అనుభవిస్తున్నారు. ఒకప్పుడు బస్సు ఛార్జీలకు జేబులో నుంచి డబ్బులు తీయలేని డైరెక్టర్లు కొందరు ఇప్పుడు ఆడి, ఇతర ఖరీదైన కార్లలో తిరుగుతున్నారు. విలాసవంతమైన ఇళ్లు సంపాదించుకున్నారు. విశాఖ డెయిరీని కుటుంబ ఆస్తిగా ఆడారి కుటుంబం మార్చుకుందన్న విమర్శలున్నాయి. డెయిరీ చైర్మన్ ఆనందకుమార్ ముందు నుంచీ డైరెక్టర్లను అదుపులో ఉంచడం కొనసాగుతోంది. రైతుకు వైద్యం నిమిత్తం ఏటా ప్రయివేటు ఆస్పత్రి కిమ్స్‌కు లక్షలు చెల్లింపు, నైపుణ్య శిక్షణకు కోట్లలో ఖర్చు చూపించడంపై పలు అనుమానాలు వ్యక్తం చేసిన ప్రత్యేక సభా సంఘం డెయిరీ లీలలు ఒక్కో దానిపైనా సమాచారం సేకరించే పనిచేస్తున్నట్లు తెలిసింది.

డెయిరీ రికార్డుల్లో చూపిస్తున్న రూ.కోట్ల ఖర్చును క్షేత్రస్థాయిలో సభా సంఘం పరిశీలిస్తే వాస్తవాలన్నీ బయటకు వస్తాయి. నియమిత కాలానికి ముందు రికార్డులను స్వాధీనం చేసుకొని విచారణ చేపడితే డెయిరీ పాలకవర్గ పాపాలు బయటపడనున్నాయి. బిజెపిలో ఆనందకుమార్ చేరికతో తమ అవినీతి కథ ముగిసిపోతుందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. అయితే, సభా సంఘం ఆ విమర్శలన్నీ వట్టివేనని తేల్చిచెప్పేలా విచారణ పూర్తిచేసి వాస్తవ నివేదిక ఇస్తుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. బ్యాంకుల్లో రూ.300 కోట్లకుపైగా ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లపైనా సభా సంఘం దృష్టి పెట్టాల్సివుంది. ఈ సొమ్ము పూర్తిగా బ్యాంకుల నుంచి తీసినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఏయే బ్యాంకులో ఎప్పుడు, ఎంత డిపాజిట్ చేశారు? డిపాజిట్ల సొమ్ము ఎప్పుడు, ఎంత చొప్పున ఎవరెవరు తీశారు? దేనికి ఉపయోగించారు? అనేది ఆరా తీయాలి. తీసిన డిపాజిట్ల సొమ్ము వ్యవహారంపై పాలకవర్గం గోప్యంగా ఉంచుతోంది. సహకార రంగంలో డెయిరీ ఉన్నకాలంలో ఫిక్స్‌డ్

మిగతా 2లో..

విశ్వహిందూ పరిషత్ సర్వేను నిలిపేయాలి

అనకాపల్లి కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశ్వ హిందూ పరిషత్ చేపట్టిన సర్వేను నిలుపుదలచేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్‌చేశారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. అనకాపల్లి జిల్లాలో విశ్వ హిందూ పరిషత్ సర్వే చేపట్టిందని, ప్రధానంగా క్రైస్తవ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని ఈ సర్వే జరుగుతోందని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికో, సామాజిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులను తెలుసుకోడానికో సర్వేలు చేయడం సర్వసాధారణమైనప్పటికీ, అసాధారణమైన రీతిలో విశ్వ హిందూ పరిషత్ సభ్యులు గోప్యంగా మతాల పేరుతో సర్వే నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఆ సర్వే పత్రాన్ని పరిశీలిస్తే గ్రామాల వారీగా క్రైస్తవులు ఎందరు ఉన్నారు.. ముఖ్యంగా దళితవాడల్లో క్రైస్తవులు ఎందరు ఉన్నారో గుర్తించడమేనని స్పష్టమవుతోందని వివరించారు. గ్రామంలో క్రైస్తవ వ్యతిరేకులు ఎవరెవరున్నారన్న వివరాలను కూడా ఆరా తీస్తున్నారని తెలిపారు. ఇప్పటికే దళితుల్లో విభజన తీర్పు వల్ల ఉప కులాల మధ్య వైశమ్యాలు ఉన్నాయని, దీనిని ఆసరాచేసుకొని విశ్వ హిందూ పరిషత్ రెచ్చగొట్టే ప్రయత్నంలో భాగంగా ఈ సర్వే నిర్వహిస్తే ఘర్షణలు జరిగే ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. విహెచ్‌పి కేవలం ఉపకులాల మధ్య, హిందూవులు, హిందూయేతరల మధ్య అనైఖ్యత సృష్టించడానికే ఈ సర్వే అని విధతమౌతుంని తెలిపారు. పేదల మధ్యన ఘర్షణలు జరిగితే తీవ్ర ప్రమాదాలు సమాజానికి చేటు చేసుకుంటాయని వివరించారు. రాజ్యాంగం ప్రకారం సర్వ మతాలు సమానమేనని, కాని నేడు విశ్వ హిందూ పరిషత్ నిర్వహించే సర్వేల వల్ల ప్రశాంతమైన జిల్లాలో మత ఘర్షణలు జరిగే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వెంటనే జోక్యం చేసుకొని విహెచ్‌పి గత చరిత్ర, అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇటువంటి సర్వేలను నిషేధించాలని, గ్రామాల్లో ప్రజల మధ్య ఉన్న మతసామరస్య వాతావరణాన్ని కాపాడాలని కోరారు.

ఆస్తి పన్ను చెల్లింపులో 50 శాతం వడ్డీ రాయితీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆస్తిపన్ను చెల్లింపుపై 50 శాతం వడ్డీ మాఫీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ననుసరించి, జివిఎంసికి చెల్లించాల్సిన ఇంటిపన్ను, ఖాళీ జాగా పన్నుల బకాయిలు 2025 మర్చి 31లోగా ఒకే మొత్తంగా చెల్లిస్తే వడ్డీలో 50 శాతం మినహాయింపును పొందవచ్చని తెలిపారు.

పరిహారం చెల్లించిన తర్వాతే పనులు

వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల ధర్నా

వార్త మెయిన్ 3లో..

మా బిల్లులు చెల్లించండి

ఉత్తరాంధ్ర కాంట్రాక్టర్ల ధర్నా

వార్త మెయిన్ 3లో..

'తల్లీబిడ్డ' ఉద్యోగులకు కనీస వేతనాలు అమలుచేయాలి

వార్త 2లో..

రైతులపై చిత్తశుద్ధి లేదు

బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైతుల పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. విశాఖపట్నం లోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతుంటే కూటమి సర్కార్ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతాంగాన్ని ఆదుకోవాలని, లేకుంటే వైసిపి నుంచి రైతు పోరును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడినా రైతులకు కడగండ్లు తప్పడం లేదన్నారు. కరువు, లేదంటే అతివృష్టి, గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటి పరిణామాలను రైతులు చవిచూస్తున్నారని తెలిపారు. మిర్చి రైతులు రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు చేస్తున్నా ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు.

మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

మీడియా ప్రశ్నలకు సమాధానంగా జివిఎంసి మేయర్‌గా ఉన్న యాదవ సామాజికవర్గానికి చెందిన బీసీ మహిళను పదవి నుంచి తొలగించాలని తెలుగుదేశం ప్రయత్నిస్తోందన్నారు. మరొక ప్రశ్నకు సమాధానంగా అసెంబ్లీలో ఎమ్మెల్యేల సాంస్కృతిక కార్యక్రమాలపై మాట్లాడుతూ, ఒకరిని కించపరిచేలా వ్యవహరించడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ పాల్గొన్నారు

విఎంఆర్‌డిఎ విలీన మండలాల కసరత్తు

ఐఐటి ఖరగ్‌పూర్‌కు కొత్త 'మాస్టర్ ప్లాన్' బాధ్యతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అనకాపల్లి, విజయనగరంలో విలీనమైన 14 మండలాల కోసం విశాఖపట్నం మెట్రోపాలిటన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) కొత్త మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఐఐటి-కె (ఖరగ్‌పూర్)ను ఎంపిక చేసుకుంది. ఐఐటి ఖరగ్‌పూర్ దేశంలోని 4 ప్రముఖ సంస్థల్లో ఒకటి కావడం, హౌసింగ్, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా ఈ సంస్థను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా గుర్తించడంతో పెరుగుతున్న పట్టణాల విస్తీర్ణం, మౌలిక వసతుల కల్పన కోసం అభివృద్ధే ధ్యేయంగా 14 మండలాల కోసం సాంకేతిక సలహాదారుగా ఎంపిక చేసినట్లు విఎంఆర్‌డిఎ కమిషనర్ జేఎస్ విశ్వనాథన్ తాజాగా వెల్లడించారు. విజయనగరం, అనకాపల్లి జిల్లా విస్తరిస్తున్న క్రమంలో 14 మండలాలను విఎంఆర్‌డిఎలోకి విలీనం చేసుకుని మాస్టర్‌ప్లాన్ వర్తించేలాగ శాటిలైట్ చిత్రాల ద్వారా భౌగోళిక పరిస్థితులను తెలుసుకోవడానికి న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్, ఒక పబ్లిక్ సెక్టార్ సంస్థ ద్వారా విఎంఆర్‌డిఎ తగిన విషయ సేకరణ చేసేందుకు సిద్ధమైంది.

విలీనం గతంలోనే... తాజాగా అభివృద్ధి ప్లాన్..

2020-21 సంవత్సరంలో ఎపి ప్రభుత్వం అనకాపల్లి జిల్లాలోని 13 మండలాలను 431 గ్రామాలతో పాటుగా, విజయనగరం జిల్లాలోని మెరకముడిదాంచ దీంట్లో 41 గ్రామాలను విఎంఆర్‌డిఎ పరిధిలోకి విలీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విలీనంలో 2455చ.కి.మీ విస్తీర్ణం విఎంఆర్‌డిఎ పరిధిలోకి వచ్చింది. గతంలో ఉన్న ప్రాంతాల కోసం ఇదివరకే మాస్టర్ ప్లాన్ ఉండగా ఐఐటి ఖరగ్‌పూర్ సృష్టించబోయే కొత్త మాస్టర్ ప్లాన్ ప్రత్యేకంగా 14 మండలాలపైనే దృష్టిపెట్టనుంది. ఈ మేరకు విఎంఆర్‌డిఎ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా నివేదిక పంపించారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం విలీన 14 మండలాలపై దృష్టిసారిస్తారు. విఎంఆర్‌డిఎ పరిధిలో ఐటిడిఎ ప్రాంతం మాత్రమే బయటనున్నట్లు లెక్క. అనకాపల్లి జిల్లాలోని మాడుగుల, రావికమతం, బుచ్చయ్యపేట, నాతవరం, కోటవురట్ల, మాకవరపాలెం, నర్సీపట్నం, గొలుగొండ, చీడికాడ, రోలుగుంట 13 మండలాలు విలీనం అయ్యాయి. పట్టణాభివృద్ధికి పైన తెలిపిన మండలాలు పటిష్టమైన అవకాశాలు కలిగి ఉన్నాయని సంబంధిత అధికారులు నివేదించారు. 2001 - 2011 మధ్య ఈ మండలాల్లో పట్టణ జనాభా 4.10శాతం నుంచి 8.02శాతం వరకూ పెరిగింది. పట్టణీకరణ పెరుగుదల సూచీకి ఇదో తార్కాణం.

వుడా నుంచి విఎంఆర్‌డిఎ అవతరణ..

2018 సెప్టెంబర్‌లో వుడా నుంచి విఎంఆర్‌డిఎగా అప్‌గ్రేడ్ చేయబడింది. ఆ సమయంలో 6501 చ.కి.మీ ఉంది. 2019లో

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆ డిపాజిట్లు ఏమైనట్లు?

డిపాజిట్ల సొమ్ముపై వచ్చిన వడ్డీ డబ్బును ఉద్యోగుల జీతాలు, కంపెనీ నిర్వహణకు ఉపయోగించేవారు.

డెయిరీకి ఏటా వచ్చే నికర ఆదాయంలో 65 శాతం పాల రైతుకు, పది శాతం ఉద్యోగులకు బోనస్‌గా చెల్లించేది. 15 శాతం రిజర్వు నిధులు, పది శాతం కంపెనీ నిర్వహణకు కేటాయించేవారు. కంపెనీ యాక్టు కింద మారాక నికర ఆదాయంలో 65 శాతం బోనస్‌ను రైతుకు చెల్లించడం మానేసింది. కేజీ ఫ్యాట్‌కు రూ.325 ఇస్తున్నట్లు ప్రకటించింది. కానీ ఇందులో రూ.295 రైతుకు చెల్లించి, మిగిలిన రూ.35 డెయిరీ ఖాతాలో ఉంచుకుంది. ఆర్థిక సంవత్సరం చివరి నెల మార్చిలో పాల ఉత్పత్తిదారుల సంఘాలకు ఈ డబ్బులు జమచేసి ట్రస్టుకు విరాళాల పేర ఆ డబ్బులను తిరిగి లాగేసుకోవడం జరుగుతోంది. ఈ నెలలో రైతుకు చెందిన కోట్ల రూపాయలు సంఘాల నుంచి ట్రస్ట్ పేర తీసుకొని చైర్మన్ తనకు నచ్చినట్లు ఖర్చు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆ ఆర్థిక లావాదేవీలు బయటకు చెప్పకుండా ఆదాయం వచ్చేలా డైరెక్టర్లకు సూపర్ స్టాకిస్టులను చేశారు. బినామీల పేర పార్లర్లు, సేల్స్ వెహికల్స్, ట్యాంకర్లు సరఫరా చేసి, స్టాకిస్టుల అవతారమెత్తి నెలకు లక్షల రూపాయలు డైరెక్టర్లు సంపాదిస్తున్నట్లు విమర్శవుంది. రైతు మేల్కొని సహకార రంగంలోకి తిరిగి తీసుకొచ్చే ఒత్తిడి ప్రభుత్వంపై చేయకపోతే మరింత ప్రమాదంలోకి విశాఖ డెయిరీ నెట్టబడుతుంది.

విఎంఆర్‌డిఎ విలీన మండలాల కసరత్తు

విఎంఆర్‌డిఎ నుంచి శ్రీకాకుళం అభివృద్ధి సంస్థను కోల్పోయింది. ఈ భాగం 1628 చ.కి.మీగా ఉంది. తద్వారా అభివృద్ధి ప్రాంతం 4873 చ.కి.మీకి తగ్గింది విఎంఆర్‌డిఎ 2020లో విజయనగరం జిల్లా మెరకముడిదాంను చేర్చుకోవడం ద్వారా 5048.67 చ.కి.మీకు పెరిగింది. 2021 మార్చిలో అనకాపల్లి జిల్లాలోగల 13 మండలాలు (2,455 చ.కి.మీ)తో విలీనంతో 7400 చ.కి.మీకు విస్తరించింది. 2011 లెక్కల ప్రకారం 40.7లక్షల జనాభా ప్రస్తుతం ఉంది.

ఫిషింగ్ హార్బర్‌లో గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అదేశాల మేరకు ఫిషింగ్ హార్బర్‌లో చేపల వ్యాపారం చేసుకుంటున్న మహిళలకు జనసేన నాయకులు మంగళవారం గొడుగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మద్దాల భాను, గరికెన రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

'శారదా పీఠం అక్రమాలపై సిట్ వేయాలి'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : శారదా పీఠం అక్రమాలపై సిట్ వేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ కోరారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగు శక్తి చేపట్టిన పోరాటాల వల్లనే శారదా పీఠం అక్రమ పునాదులు కదులుతున్నాయని, ఇది ప్రజల విజయమని పేర్కొన్నారు. శారదా పీఠంలో అక్రమ నిర్మాణాలు కూల్చి వేయాలన్నారు. శారదా పీఠం అక్రమాలపై గతంలో పెందుర్తి తహశీల్దార్‌తో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. శారదా పీఠంలో విలువైన ఆస్తులు, డాక్యుమెంట్లు తరలిపోకుండా ఉండేందుకు పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ ప్రభుత్వం శారదాపీఠం మధ్య జరిగిన అక్రమ కార్యక్రమాలకు సంబంధించి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో బోడేపూడి దొరబాబు, ఎం.శ్యాంప్రసాద్, లాడి కిషోర్ కుమార్, డాక్టర్ కె.సురేష్, పీతల అప్పారావు, దువ్వి పరమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇగ్నో అధ్యయన కేంద్రం సమన్వయకర్తల సమావేశం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వదాలయం (ఇగ్నో) 2025వ సంవత్సరానికి గాను విశాఖపట్నలోని అధ్యయన కేంద్రాల సమన్వయకర్తల సమవేశం మంగళవారం ఉషోదయ వద్ద ఉన్న ప్రాంతీయ కేంద్ర ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇగ్నో విశాఖపట్న ప్రాంతీయ కేంద్ర సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు మాట్లాడుతూ, దూరవిద్యా విధానంలో అధ్యయన కేంద్రాలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. విద్యార్థులకు, విశ్వ విద్యాలయాలకు మధ్య అధ్యయన కేంద్రాలు అనుసంధానకర్తలుగా వ్యవహరించాలని కోరారు. ఇగ్నో ఎన్నో కొత్త సాంకేతిక మార్గాలకు దారులు తెరిచి లక్షలాది మంది విద్యార్థులకు సేవలందిస్తుందని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర ఉప సంచాలకలు డాక్టర్ ఇ.కృష్ణారావు ప్రస్తుత అడ్మిషన్లు, కొత్తగా ప్రారంభమైన వివిధ కోర్సుల వివరాలను వెల్లడించారు. అధ్యయన కేంద్రాల నిరహణ, ఆర్థిక అంశాలపై వివి.పతిరావునాయడు వివరించారు.

'తల్లీబిడ్డ' ఉద్యోగులకు కనీస వేతనాలు అమలుచేయాలి

సిఐటియు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 సర్వీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ ఇవ్వకుండా ప్రభుత్వమే నేరుగా ఈ సర్వీస్‌లను నిర్వహించాలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 ఎంప్లాయిూస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవీప్రసాద్ డిమాండ్ చేశారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో విశాఖపట్నం జిల్లా 102 పైలెట్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2015లో ప్రారంభమైన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఒక పైలెట్ కు రూ.7870 వేతనం చెల్లించారని, ఇప్పటికీ అవే వేతనాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. పిఎఫ్, ఈఎస్ఐ ఇంక్రిమెంట్స్ సక్రమంగా అమలు కావట్లేదన్నారు. ఈ నేపథ్యంలో అరబిందో కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టు ఈ నెల 31వ తేదీతో ముగుస్తోందని, ఇక నుంచి ప్రభుత్వం నేరుగా నిర్వహించాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగులుగా తీసుకోవాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి మాట్లాడుతూ, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, లేబర్ కోడ్స్ రద్దు, సమాన పనికి సమాన వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టాల పటిష్ట అమలు కోసం మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బొడ్డు సుగుణ ఆత్మహత్య కారకులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మత్స్యకార మహిళ బొడ్డు సుగుణ ఆత్మహత్యకు కారకులైన వారందరినీ వెంటనే అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబనికి న్యాయం చేయాలని, ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహారాణి పేట అంగటిదిబ్బ ప్రాంతంలో నివసిస్తున్న సుగుణ, గోకుల్ థియేటర్ ప్రాంతంలోని అచ్చియ్యమ్మపేటలో తనకు అప్పు ఇచ్చిన వారి గృహంలో ఆత్మహత్యకు పాల్పడి 19 రోజులైందని, ఇందుకు బాధ్యులైన కొందరిని అరెస్టు చేసినప్పటికీ, మిగిలిన వారిని అరెస్టు చేయకపోవడం పోలీసుల అలసత్వానికి నిదర్శనం అన్నారు. నిందితులకు బెయిల్ రాకుండా చూడాలని కోరారు. అప్పు ఇచ్చిన వారి వేదింపులు తట్టుకోలేక వారి ఇంట్లోనే ఈ నెల 6 న సుగుణ ఆత్మహత్య చేసుకుందన్నారు. తీసుకున్న అప్పు లక్ష రూపాయలకు రూ.19 లక్షలా 34 వేలు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సుగుణ చెల్లించిందన్నారు. అయినా ఆమెను తీవ్రంగా వేధించడంతో ఆత్మహత్య చేసుకుందన్నారు. సుగుణ సెల్ ఫోను పోలీసులవద్దనే ఉందని, ఆ ఫోనులో ఉన్న సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశముందని అనుమానం వ్యక్తపరిచారు. ఈ కేసులో ఉమ్మడి భరత్ కూమార్, ఉమ్మడి గోపి, ఉమ్మడి ధనలక్ష్మి తమ్ముడు రాజ్ కుమార్, ఈ నేరాని సహకరించిన అలుపున చిన్నను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మృతురాలి భర్త బి.అప్పన్న, ఎస్.దానమ్మ, బి.పోలీసు, బి.నరసింహ పాల్గొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మెడికవర్ హాస్పటల్ సౌజన్యంతో మెగా మెడికల్ క్యాంపు మంగళవారం నిర్వహించారు. ఈ కేంద్రాన్ని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వివిఎస్.పద్మనాభరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం కన్వీనర్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నెలా మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని, బిపి సుగర్, ఇసిజి, దంత, నేత్ర వైద్య పరీక్షలు చేపడతామని తెలిపారు. మహిళలకు గర్భసంచి ముఖ ద్వా కేన్సర్ పరీక్ష కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. మెడి కవర్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ విజయ్ రోగులను పరీక్షించారు. శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి చీఫ్ టెక్నీషియన్ రాజు కంటి పరీక్షలు చేశారు. 150 మందికి తనిఖీలు చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పద్మనాభరాజు మాట్లాడుతూ, ప్రతి రోజూ సాయత్రం 6 గంటల నుంచి ఉచిత వైద్యం జరుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో మెడీకవర్ హాస్పిటల్స్ ఇన్‌ఛార్జి కిరణ్, డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్ కుమార్, శైలజ, సిఐటియు నాయకులు వై.రాజు, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకులు చంద్రమౌళి, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు ఎస్.కళాధరం తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి ఇంట్లో నోట్ల కట్టలపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంటిలో సగం కాలిన నోట్ల కట్టలపై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ విచారణ జరపాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు విదసం ఫిర్యాదు చేసింది. ఎంవిపి కాలనీలోని సౌత్ రీజన్ సబ్ జోనల్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ నరేంద్రకు విదసం నాయకులు మంగళవారం సాయంత్రం ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ నగదు లావాదేవీల్లో ఎన్ని తీర్పులు ప్రభావితమయ్యాయో నిగ్గు తేల్చేందుకు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కన్వీనర్లు సోడదాసి సుధాకర్, గుడివాడ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా బాధితులకు పరిహారం అందజేశారు. ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలయిన గొంతిన అచ్చిబాబు, బర్లంగి వెంకట రమణ, గట్టు తులసీభాయ్‌లకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లోకి జమచేసినట్లు పోలీస్ కమిషనర్ కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. హిట్, రన్ కేసుల్లో సహాయం కోసం రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం, లేదా టోల్ ఫ్రీ నెంబర్ 7995095793ను సంప్రదించాలని సూచించారు.

'మేయర్ పీఠం కూటమి కైవసం'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గి మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంటుందని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ తెలిపారు. జివిఎంసి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, గడిచిన నాలుగేళ్ల అవినీతి, అక్రమాలతో పాలన సాగిందన్నారు. నైతికత కోసం మాట్లాడే హక్కు వైసిపికి లేదన్నారు.

కరూర్ వైశ్యా బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) నగరంలోని ఎండాడ వైశాఖి స్కై లైన్ ఎదురుగా వర్మ ప్లాజాలో నూతన శాఖను సోమవారం ప్రారంభించింది. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్ దివాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ శాఖను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేవీబీ సేవలు ఈ ప్రాంత వాసులకు అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు.

కెజిహెచ్‌లో చలివేంద్రం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ డైట్ సెక్షన్ వద్ద తాగునీరు, మజ్జిగ చలివేంద్రాన్ని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కెజిహెచ్‌కు వస్తున్న రోగులు, వారి సహాయకులకు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మరి కొద్ది రోజులలో రద్దీ అధికంగా ఉండే మరికొన్ని చోట్ల చలివేంద్రాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జి.వాసవీలత, డిప్యూటీ సిఎస్ఆర్ ఎంఒ డాక్టర్ జి.మెహర్ కుమార్, ఆర్ఎంఒ డాక్టర్ ఎ.రాజేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ సిహెచ్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అదానీ గంగవరం పోర్టులో డిఆర్ఎం తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, ఉన్నత స్థాయి అధికారుల బృందంతో కలిసి మంగళవారం అదానీ గంగవరం పోర్టు, దాని రైల్వే సైడింగ్‌ను తనిఖీ చేశారు. తనిఖీ అనంతరం డిఆర్ఎం లలిత్ బోహ్రా, అదానీ గంగవరం పోర్టు సిఇఒ అమిత్ మాలిక్‌తో సమావేశమయ్యారు. పలు కీలక అంశాలపై చర్చించారు. సామర్థ్యాన్ని పెంపొందించడం, రేక్ డిటెన్షన్, సామర్థ్య మెరుగుదల త్రూపుట్‌కు సంబంధించిన సవాళ్లను పరిష్కరించడానికి సహకార ప్రయత్నం చేస్తామని డిఆర్ఎం బృందానికి హామీ ఇచ్చారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం - గండిగుండం

<u>రేఖా నెం. 3/2025</u> <u>టెండరు ప్రకటన</u> <u>తేదీ.26-03-2025</u>

విశాఖపట్నం జిల్లా, ఆనందపురం మండలం, గండిగుండం గ్రామపంచాయితీ నందు, దిగువ షెడ్యూలు నందుదహరించిన పనులను **2025-26 సం.నకు** కాంట్రాక్టు పద్దతిపై చేయుటకు పనివార్ని సప్లయి చేయుటకు తే: 28-03-2025దిన మధ్యాహ్నం 12 గంటల వరకు గండిగుండం గ్రామ సచివాలయం నందు ఈ దిగువ సంతకం దారునిచే గానీ, వారి అనుమతి పొందిన యితర ఉద్యోగిచే గానీ, సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించబడిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం.3.00 లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. టెండర్లలో పాల్గొనదలచిన వారు టెండరు ధరవత్తు చెల్లించి, టెండరు షరతులకు లోబడి టెండర్లలో పాల్గొనవలెను.

షెడ్యూల్

క్ర.నెం	పని వివరములు	పనివారి సంఖ్య	ధరావత్తు రూ.
1	పారిశుధ్య పనులు	06	10,000/-
2.	వీధిలైట్లు నిర్వహణ	01	
3.	మంచినీటి పంపు నిర్వహణ ప్లంబింగ్ పనులు	07	
4.	ఆఫీస్ స్వీపర్ & అటెండర్	01	

గమనిక : (1) పై పనుల యొక్క టెండర్లు శ్రీ జిల్లా కలెక్టర్ (పం.వి.), విశాఖపట్నం వారి అనుమతికి లోబడి ఖరారు చేయుట మరియు కాంట్రాక్టు పనులకు చెల్లింపులు చేయుట జరుగును. **(2)** టెండర్లు ఎట్టి కారణం చూపి గానీ, చూపకుండా గానీ, రద్దు పరుచుటకు, వాయిదా వేయుటకు, తిరస్కరించుటకు గ్రామపంచాయితీకి పూర్తి అధికారము గలదు. **(3)** పూర్తి షరతులు, యితర వివరములు కార్యాలయ పనివేళలందు పంచాయితీ కార్యదర్శి వారిని సంప్రదించి తెలుసుకొనగలరు.

సం/- పి.శివప్రసాద్ పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ, గండిగుండం, ఆనందపురం మండలం

సం/- గండ్రెడ్డి శ్రీనివాస్, సర్పంచ్, గ్రామపంచాయితీ, గండిగుండం, ఆనందపురం మండలం.

IN THE HON'BLE COURT OF THE V ADDL. DISTRICT AND SESSIONS CUM FAMILY JUDGE AT: VISAKHAPATNAM
F.C.O.P. 1372/2023

<u>Between:</u>
Terapalli Harika ...Petitioner
<u>And:</u>
Terapalli Ram Prasad ...Respondent

<u>NOTICE</u>

To, **<u>The Respondent</u>**:
Terapalli Ram Prasad,
S/o. T. Nagabhushanam,
Hindu, aged 36 years,
R/at D.No.6-32/3/3,
Revenue Ward-85,
Danaboinivanipalem,
Near Stardom School,
Aganampudi,
Visakhapatnam-530053.

Please take notice that the above FCOP.1372/2023 filed by the petitioner against the respondent for maintenance and the Hon'ble Court was pleased to order notice to respondent through this publication and the matter stands posted to **11-04-2025** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **11-04-2025** at **10:30 A.M** in the above Hon'ble Court, failing which the matter will be heard and determined in your absence.

VENNELA ESWARA RAO,
M.V. SASIBHUSHANA RAO
Advocates,Visakhapatnam.

లక్ష్యానికి దూరంగా 'ఉపాధి'

- 5,395 కుటుంబాల్లో 4,216 మందికే పని కల్పన
- 200 కుటుంబాలకే ఏడాదిలో వంద రోజుల పని
- చట్టంలోని సౌకర్యాలన్నీ అటకెక్కించేసిన అధికారులు

సింగనబంద గ్రామం మామిడిబంద చెరువులో ఉపాధి పనుల్లో కూలీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం :కేంద్ర ప్రభుత్వ విధానాలే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొంటోందనే విమర్శలు ఉన్నాయి.గతేడాది ఏప్రిల్ నుంచి ప్రస్తుతం మార్చి వరకు చెరువుల పూడిక తీత పనుల్లో జాబ్ కార్డులున్న 44.88 శాతం కుటుంబాలకు మాత్రమే పని కల్పించారు. మండలంలో మత్స్యకారులున్న అన్నవరం మినహా మిగిలిన 15 పంచాయతీల్లో 696 పనులు చేపట్టారు.

4,216 కుటుంబాలకు పని కల్పన..

మండలంలో 6,298 జాబ్ కార్డులుండగా, 5,395 కుటుంబాలకు పని కల్పించాల్సి ఉండగా 4,216 కుటుంబాలకు పని కల్పించారు. వీరికి వేతనాల రూపంలో రూ 4.89 కోట్లను అందజేశారు. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా కూలీల హాజరు నమోదుచేసి, రోజువారీ పని కొలతలు బట్టి, వారానికోసారి వేతనాలను బ్యాంకు ఖాతాల్లో వేస్తుండగా, సగటును రోజుకు రూ. 300 వరకు వేతనం లభిస్తున్నట్లు సంబంధిత అధికారులు, కూలీలు చెబుతున్నారు.

వంద రోజుల పని కొందరికే...

జాబ్‌కార్డున్న ప్రతి కుటుంబానికి ఏటా వంద రోజుల పని కల్పన ఉత్తిమాటగానే మిగిలిందని చెప్పాలి. ఈ ఏడాది ఇప్పటివరకు 4,216 కుటుంబాలకు మాత్రమే పనికల్పించగా, వారిలో కేవలం 200 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పని చేశారు.

పని ప్రదేశాల్లో కానరాని సదుపాయాలు

ఉపాధి చట్టంలోని నిబంధనలకు లోబడి పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రాథమిక చికిత్సకు మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలను కల్పించాల్సి ఉండగా, తొలినాళ్లలో ఇవి అందుబాటులో ఉన్నా, ప్రస్తుతం కొన్నేళ్లుగా ఆయా సౌకర్యాలు పూర్తిగా లేకుండా చేశారు. వేసవిలో పనికి వచ్చే కూలీలు వడదెబ్బ తగలకుండా ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాల్సి ఉండగా,అమలు చేయడంలేదు. వేసవి అలవెన్స్‌లు, పనిముట్లు పంపిణీ వంటిని పూర్తిగా అటకెక్కించేశారని కూలీలు అంటున్నారు.

కాగా ఉపాధి పనులను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎపిఒదే కాగా, ప్రస్తుతం భీమిలి మండలంలో రెగ్యులర్ ఎపిఒ లేకపోగా, కొన్నాళ్ల క్రితం ఇక్కడే పనిచేసి, ఆనందపురం బదిలీపై వెళ్లిన గౌరి ఇన్‌ఛార్జి బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 75 మంది మేట్లు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

రెండో అంతస్తు నుంచి జారిపడి పెయింటర్ మృతి

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 63వ వార్డు చింతలలోవ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.పెళ్లి ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా హెల్పర్ నిర్లక్ష్యంగా పట్టుకున్న తాడు నిచ్చెన (బాడ) జారిపోవడంతో రెండో అంతస్తు నుంచి పెయింటర్‌తో పాటు హెల్పర్ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెయింటర్ సంగిరెడ్డి రామకృష్ణ (23)ను వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. తీవ్రగాయాలతో హెల్పర్ కిరణ్ చికిత్స పొందుతున్నాడు. అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సిఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు మల్కాపురం పోలీసులు తెలిపారు.

చోరీలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి- ములగాడ : ఇళ్లల్లో విలువైన వస్తువులు, బయట బైకల చోరీపై అప్రమత్తంగా ఉండాలని మల్కాపురం క్రైం ఎస్ఐ వెంకటరమణ సూచించారు. మంగళవారం హెచ్‌పిసిఎల్ లేబర్‌గేటు వద్ద కార్మికులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడుతూ, వేసవిలో రాత్రివేళల్లో ఆరుబయట నిద్రించే సమయంలో ఇళ్లలోని విలువైన వస్తువులకు తగు రక్షణ కల్పించి తాళాలు వేసి నిద్రించాలని సూచించారు. అలాగే విధి నిర్వహణకు బైక్‌లో వచ్చి, రోడ్డు పక్కన పార్కింగ్ చేస్తున్న యజమానులు ఎవరికి వారే తగు జాగ్రత్తలు తీసుకోవాలని, బైక్‌ల వీల్స్‌కు చైన్‌లాక్‌లు వేసుకోవడం సురక్షితమన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి -ములగాడ : విద్యార్థి దశ నుంచే చిన్నారులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, దానికి వివిధ పోటీలలో పాల్గొని ప్రతిభకు పదును పెట్టుకోవాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక క్రాంతినగర్ శ్రీసాయిలత స్కూల్‌లో నిర్వహించిన క్రీడల వార్షికోత్సవంలో మాట్లాడారు స్కూల్ కరస్పాండెంట్ వై. రామ్‌లాల్ మిత్ర, ప్రిన్సిపాల్ కె.శైలజలతో కలిసి, వివిధ పోటీలు, క్రీడలలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు పతకాలను, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూరీసర్వేపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి -ఆనందపురం :మండలంలోని గిడిజాల, కుసులవాడ గ్రామాల్లో మంగళవారం భూరీసర్వే ప్రారంభమైంది. ఈసందర్భంగా గిడిజాల గ్రామంలో తహశీల్దార్ పి.శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సచివాలయం నుంచి, గిడిజాల గ్రామం శివారు వరకు సాగిన ర్యాలీలో చివరి వరకు సాగని ర్యాలీలో డివిజనల్ సర్వే అధికారి కొండలరావు, రీసర్వే డిటి గోవింద్, మండల సర్వేయర్ అప్పన్న, సర్పంచ్ పినగం అప్పలరాజు, మాజీ సర్పంచ్ కోరాడ రాము, గ్రామ పెద్దలు ఘట్టమనేని సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.

పద్మనాభం. మండలంలోని కొవ్వాడ గ్రామంలో మంగళవారం తహశీల్దార్ కె.ఆనందరావు ఆధ్వర్యంలో భూరీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రీ సర్వేపై ఎటువంటి అపోహలు లేకుండా తగు సమాచారమిచ్చి, సహకరించడం ద్వారా రైతులు తమ భూములను రీసర్వే చేయించుకోవాలని తహశీల్దార్ సూచించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం ఆర్ తాళ్లవలసలో ఇటీవల అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధితుడు సి హెచ్ అప్పారావు కుటుంబానికి భీమిలికలిగొట్ల స్ఫిర్డ్ శ్రీ దేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఛైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి మంగళవారం నెలకు సరిపడా బియ్యం, పప్పులు, వంట నూనె, రూ 5 వేలు చెక్కును అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు లక్ష్మణ్, శంకర్, కిషోర్ పాల్గొన్నారు

విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జెడ్‌పి హైస్కూల్‌లో 92 మందికి చిప్పాడ హైస్కూలక్ష 81మంది విద్యార్థులకు నన్నిహికలి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరిగుడి సంతోషి, గ్రామపెద్దలు ఈశ్వరరావు, హెచ్ఎంలు ఎంటిఎస్‌వి ప్రసాదరావు, ఎంవిటి రత్నం, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రేఖ అప్పారావు, ఎస్ఎస్ విజయ కుమార్ ఎస్ఎంసి ఛైర్మన్, సభ్యులు , ప్రాజెక్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని శేరికండం గ్రామంలో మంగళవారం ఆరోగ్యవంతమైన లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ కె.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనను భీమిలి వెటర్నరీ ఎడి బివి.రమణ ప్రారంభించారు. ప్రదర్శనలో 40దూడలు పాల్గొనగా, ఆరోగ్యవంతమైన దూడల పెంపకందారులు వాడపల్లి రమేష్‌కు ఒకటి, రెండో బహుమతులను, సంగు అప్పలరాజుకు మూడో బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి చిన్నారావు రెడ్డిపల్లి పశువైద్యాధికారి లక్ష్మణరావు. పాండురంగ పశు వైద్యాధికారి అరుణ్ పాల్గొన్నారు

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-పద్మనాభం: స్థానిక కస్తూర్బా పాఠశాలలో వచ్చే విద్యాసంవత్సరంలో ఆరోతరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలతోపాటు ఇంటర్ సెకెండియర్‌లో ఖాళీగా ఉన్న 14 సీట్లు భర్తీకి వచ్చేనెల 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి- సీతమ్మధార : అర్బన్ ఐసిడిఎస్ పరిధిలోని గోపాలపట్నం, చినగదిలి, ములగాడ మండలాల 150 మంది అంగన్వాడీ కార్యకర్తలకు సామర్థ్యం పెంపుదలపై మూడురోజుల శిక్షణనిచ్చినట్లు అర్బన్ సిడిపిఒ ఎం. రమణకుమారి తెలిపారు. 0-3ఏళ్ల పిల్లలకు నవచేతన, 3-6ఏళ్ల పిల్లలకు ఆధార్ విల్లా పేరుతో చిన్నారుల్లో విద్యను, పోషణ స్థాయిని పెంచేందుకు అంగన్వాడీలకు శిక్షణనిచ్చామన్నారు.

నేటి నుంచి ఉచిత ధ్యాన శిక్షణ

ప్రజాశక్తి -ఆనందపురం : స్థానిక సచివాలయం వద్ద ఈనెల 26 నుంచి 28 వరకు మూడు రోజులపాటు ప్రతిరోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి 6.30గంటల వరకు ఉచిత ధ్యాన శిక్షణ నిర్వహించనున్నట్లు హార్ట్ ఫుల్ నెస్ సంస్థ ప్రతినిధులు ఎన్‌వి. సూర్యనారాయణ తెలిపారు. ధ్యానంతో ప్రశాంతమైన జీవనం గడపడానికి అవకాశం ఉంటుందన్నారు. 15ఏళ్లపైబడిన ప్రతిఒక్కరూ ధ్యాన శిక్షణలో పాల్గొనవచ్చునన్నారు

ఘనంగా సాగరదుర్గమ్మ పండగ

ప్రజాశక్తి పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో మంగళవారం సాగరదుర్గమ్మ గ్రామదేవత పండుగ ఘనంగా నిర్వహించారు. ఆదివారం డోలు మోగించి, చాటింపుతో పాల్గొన్న పండుగలో ప్రత్యేక పూజలు, మొక్కుబడులు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు బుగత సత్యనారాయణ, ఎంపిపి రాంబాబు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను పెంపు విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - మాధవధార : పట్టణాలు, నగరాలలో ఆస్తి పన్ను పెంపుదలకు గత ప్రభుత్వం జారీ చేసిన మున్సిపల్ ఆస్తిపన్ను సవరణ చట్టం 44/2020, జిఒ 198లను వెంటనే నిలిపివేయాలని పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు ప్రభుత్వాన్ని కోరారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం నుండి 0.25 శాతం అదనపు అప్పు పొందేందుకు చట్ట సవరణచేసి ప్రజలపై శాశ్వతభారాన్ని మోపారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించి, తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామనిఎన్నికల్లో వాగ్దానం చేశారన్నారు. అయితే నేటికీ దీనిపై సమీక్షించలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. రిజిస్ట్రేషన్ విలువకు ఆస్తి పన్ను లింకు చేయడం వల్ల, ప్రభుత్వం ఆస్తుల మార్కెట్ విలువను పెంచిన ప్రతిసారి ఆస్తి పన్ను పెరిగిపోతుందన్నారు. ఏటా 15శాతం పెంచిన ఆస్తి పన్ను ఇపుడు వందశాతం దాటిందన్నారు. వచ్చేనెల నుంచి విధించాలనుకున్న 15శాతం అదనపు పన్ను రద్దుచేసి పట్టణ ప్రజలకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అవగాహనతో క్షయవ్యాధి నిర్మూలన

ప్రజాశక్తి - ఆరిలోవ : అప్రమత్తత, అవగాహనతోనే క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యమని, ఆరిలోవ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిత అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరిలోవ ఎస్‌ఆర్‌ఎస్ టిబి యూనిట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరంతో బాధపడుతున్నట్లయితే వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షలతోపాటు క్షయవ్యాధి నిర్ధారణ జరిగితే మందులు ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డెంటల్ సర్జన్ రాగసుధ, పిడియాట్రిషన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు సూర్యనారాయణ, వేములయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార: వైద్యసిబ్బంది సమయపాలన పాటించి, రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ .పి.జగదీశ్వరరావు సూచించారు. మంగళవారం జాలరిపేట సచివాలయాన్ని సందర్శించి, ఎన్‌సిడి 3.0, ఆభ ఐడి జనరేషన్, హెచ్‌బివైసి విజిట్స్‌ను స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు సూచనలు చేశారు.

అనంతరం ఆర్.తాళ్లవలస పిహెచ్‌సిని సందర్శించి, వైద్యసేవలపై సమీక్షించారు. ఇన్, అవుట్‌పేషెంట్ సేవలు, వ్యాధినిర్ధారణ పరీక్షలు, మందుల నిల్వలు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పరిశీలించి, వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ముఖహాజరుతోపాటు క్షేత్ర సందర్శనకు వెళితే మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది, ఎంపిహెచ్ఇఒ నాగభూషణం, పాల్గొన్నారు.

యాదవులకు మేయర్ పదవి కేటాయించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : యాదవులకు మేయర్ లేదా డిప్యూటీ మేయర్ పదవి కేటాయించాలని యాదవ సంఘం నాయకులు ఒమ్మి కనకరాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పౌర గ్రంథాలయంలో 'నగర మేయర్ ఎన్నికపై చర్చ', నగర పాలక సంస్థలో యాదవ సామాజిక వర్గం పాత్రపై చర్చలో విశాఖ యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ యాదవులకు సముచిత స్థానం కల్పిస్తారన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబుపై పూర్తి నమ్మకం ఉందన్నారు..

అన్ని రంగాల్లో వెనుకబడిన యాదవ సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. మేయర్ లేదా డిప్యూటీ మేయర్ స్థానాన్ని యాదవులకు ఇవ్వాలని కోరారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు పిన్నింటి ఆదిమూర్తి, నక్క పద్మ, మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, సుమన్, ఒమ్మి ఆనంద్, అల్లు రమణారావు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 63వ వార్డు క్రాంతినగర్ గ్రామంలో ముస్లిం సోదరుల ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, మసీదులో ఇమామ్ నిర్వహించే వారికి ప్రభుత్వం తరపున తోడ్పాటు అందుతుందన్నారు. కార్యక్రమంలో జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు గల్లా చిన్న, కూటమి నేతలు, ముస్లిములు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న గణబాబు, చిన్న

ఇంటి పన్నులు విధించక ఇబ్బందులు

భీమిలిలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : తమ ఇళ్లకు పన్నులు విధించక పోవడంతో తాగునీటి కుళాయిలు, ఇతర సౌకర్యాలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నామని జివిఎంసి ఒకటో వార్డు కొండపేట కొండ వాలు ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పార్టీ భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో సిపిఎం ప్రజా చైతన్యయాత్ర నిర్వహించి, సమస్యలను తెలుసుకున్నారు. ఏళ్ల క్రితం అప్పులు చేసి కొండపై ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకున్నామని, వీటికి పన్నులు విధించాలని పదేపదే జివిఎంసి అధికారులను వేడుకున్నా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొండవాలు ప్రాంతాల్లో మెట్లమార్గం, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. చుట్టూ ముళ్లపొదల మధ్య జీవనంతో ఎటునుంచి విషకీటకాలు, పాములు వస్తాయోనని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామన్నారు. పింఛన్లు, ఇతర సమస్యలపై విన్నవించారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు ఎస్ అప్పలనాయుడు పాల్గొన్నారు

పెన్షనర్ల సమస్యలపై కేంద్రం నిర్లక్ష్యం

మాట్లాడుతున్న అశోక్‌రావు

ప్రజాశక్తి -గాజువాక : పెన్షనర్ల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విశాఖ పెన్షనర్ల పోరాట కమిటీ అధ్యక్షుడు కమాండర్ అశోక్‌రావు అన్నారు. మంగళవారం గాజువాకలో వైజాగ్ పెన్షనర్ల సంఘం పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు చేసి రిటైరైన పెన్షనర్లంతా చాలీచాలని పెన్షన్‌తో ఇబ్బందులు పడుతున్నా కేంద్రానికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్ రూ.7,500 చెల్లింపుతోపాటు పెన్షనర్ల దంపతులకు ఉచిత వైద్య సదుపాయం, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఉరుకూటి బాబూరావు, ప్రధాన కార్యదర్శి అప్పారావు, సంస్థ ప్రతినిధులు ఎం రామారావు, డి ఆదినారాయణ, బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

జెడ్‌పి అతిథి గృహం మరమ్మతులకు నిధులు

అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జెడ్‌పి అతిథిగృహం మరమ్మతులకు రూ.20లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర వెల్లడించారు. మంగళవారం భీమిలిలో పర్యటించి, మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, సింగనబంద సర్పంచ్ జివి.నారాయణ, ఎంపిడిఒ ఎస్ హనుమంతరావు, ఇఒపిఆర్‌డి కె రమేష్‌నాయుడు, సిబ్బంది స్వాగతం పలికారు.అనంతరం మరమ్మతుకు గురైన జెడ్‌పి అతిథి గృహాన్ని పరిశీలించారు. నూకాలమ్మ ఆలయాన్ని సందర్శించారు. టిడిపి నాయకులు గాడు తాతినాయుడు, పంచాయతీరాజ్ డిఇఇ జగదీష్ బాబు పాల్గొన్నారు.

పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ ఆపాలి

సిఐటియు ఆధ్వర్యాన విడిఎల్‌బి, డాక్ వర్కర్స్ యూనియన్ నిరసన

నిరసన నినాదాలు చేస్తున్న పెన్షనర్లు, కార్మికులు

ప్రజాశక్తి- ములగాడ : పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రయివేటీకరణ యోచనను వెంటనే విరమించుకోవాలని విడిఎల్‌బి, డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జివిఎంసి 61వవార్డు మల్కాపురం సెంటర్‌లో నిరసన చేపట్టారు. పోర్టు పెన్షనర్స్, ఎంప్లాయిస్ పాల్గొన్న నిరసనలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ త్రినాధరావు మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రిని పిపిపి పద్ధతిలో అభివృద్ధి పేరుతో గత సెప్టెంబర్‌లో టెండర్లు పిలిస్తే అన్ని యూనియన్లతో కలిసి సిఐటియు చేపట్టిన పోరాటంతో అది నిలుపుదల చేసినా, వచ్చే నెల 21న మలివిడత టెండర్లను తెరిచేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. పోర్టు ఉద్యోగులు, పెన్షనర్ల ఆధ్వర్యంలో ఇప్పటికే ఆసుపత్రి వద్ద నిర్వహిస్తున్న రిలేదీక్షలతో ప్రభుత్వం, యాజమాన్యం వెనకడుగు వేసినట్టే కనిపించినా, పదేపదే టెండర్లకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు వారి కుటుంబాల ఆరోగ్య భద్రతతో ముడిపడి ఉన్న పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ వ్యవహారంపై ప్రభుత్వం వెనక్కు తగ్గేవరకు పోరాటాన్ని కొనసాగిద్దామని స్పష్టం చేశారు. దీనిపై వచ్చేనెల 9న పోర్టు ఎఒ భవనం వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్ష కార్యదర్శులు కె పెంటారావు, ఆర్ లక్ష్మణమూర్తి జోన్ నాయకులు ఉరుకుటు బాబూరావు పాల్గొన్నారు.

మెడికల్ సర్టిఫికెట్లకు డబ్బుల వసూళ్లు దుర్మార్గం

విద్యార్థులతో సిఐటియు నేత రాజ్‌కుమార్

ప్రజాశక్తి -మధురవాడ : ఎన్‌సిసి విద్యార్థుల మెడికల్ సర్టిఫికెట్లకు ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులు రూ.200 నుంచి రూ.300 చొప్పున ఒక్కో విద్యార్థి నుంచి డబ్బులు వసూలు చేయడం దుర్మార్గమని సిఐటియు మధురవాడ జోన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థులు ఎన్‌సిసి క్యాంపునకు వెళ్లేందుకు మెడికల్ సర్టిఫికెట్లు అవసరమైన నేపథ్యంలో స్వతంత్రనగర్ యుపిహెచ్‌సి, మధురవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా అక్కడి సిబ్బంది, వైద్యులు ఆసుపత్రి నిర్వహణ ఖర్చుల పేరుతో కచ్చితంగా ఇవ్వాలని పేద విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. దీనిపై డిఎంహెచ్‌ఒ దృష్టికి తీసుకెళ్లి, ఉచితంగా మెడికల్ సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరినట్లు సిఐటియు మధురవాడ జోన్ కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు.

31న శ్రీకాకుళంలో యుటిఎఫ్ సదస్సు

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి మోహనరావు

ప్రజాశక్తి -తగరపువలస : ఈ నెల 31న శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో యుటిఎఫ్ ధ్వర్యంలో పోరుబాట పేరుతో విద్యా, ఆర్థిక, రంగ డిమాండ్ల సాధనకు నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలతో సమావేశంలో మాట్లాడుతూ, గత ప్రభుత్వం జారీ చేసిన 117జిఒకు బదులుగా అలాంటిదే మరో జిఒ జారీచేసి, కూటమి ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాలలను నిర్వీర్యం చేయాలని చూస్తోందని, దీని వల్ల డ్రాపౌట్స్ పెరుగుతాయన్నారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, విద్యా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే యుటిఎఫ్ సదస్సుకు తరలిరావాలని కోరారు. ఇటీవల ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరికి ఓట్లేసిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎ పైడిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్, పూర్వ ప్రధాన కార్యదర్శి వైఎఆర్‌కె ప్రసాద్, మండల కమిటీ గౌరవాధ్యక్షులు జి సత్యనారాయణ, అధ్యక్షులు సిహెచ్ సంతోష్‌కుమార్, సిఐటియు నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలు రేకెత్తించేలా సైన్స్ ప్రయోగాలు

గీతంలో సైన్స్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -మధురవాడ : విద్యార్థుల్లో నూతన ఆలోచనలను రేకెత్తించే విధంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ప్రయోగాలు చేసి చూపించాలని విద్యాశాఖ ఆర్‌జెడి బి.విజయభాస్కర్ అన్నారు. మంగళవారం గీతం వర్సిటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు 'లెట్ అజ్ డు సైన్స్' పేరిట ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ,సైన్స్ పట్ల ఆసక్తి పెంచేలా బోధన ఉండాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ వికసిత భారత్ సాకారం దిశగా, దేశం గర్వించ తగ్గ శాస్త్రవేత్తలు తయారు కావాలంటే విద్యార్థి దశలోనే తగిన ప్రేరణ అవసరమన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఎపి అధ్యక్షుడు డాక్టర్ జోగా చంద్రశేఖరరావు, ఎస్‌సివి ఎపిసి బి.శ్రీనివాస్ గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, కంప్యూటర్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అరుణ్‌కుమార్, డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం విశిష్ట ప్రొఫెసర్ జి.రవికుమార్ సైన్స్ పరిశోధనల ప్రాధాన్యతను వివరించారు. గీతం ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ బి.స్పందన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ (ఎన్‌సిఎస్‌టిసి) విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ద్వారా 'లెట్ అజ్ డు సైన్స్' మూడు నెలల్లో 13 ప్రభుత్వ పాఠశాలల్లోని 8125 మంది విద్యార్థులను ప్రత్యక్షంగా కలిసి సైన్స్ పట్ల ఆసక్తి కలిగేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించినట్లు వెల్లడించారు. శిక్షణ ముగింపు సందర్భంగా సర్టిఫికేట్లను అందజేశారు.

తైక్వాండో పోటీల్లో మౌనికకు స్వర్ణం

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్

ప్రజాశక్తి- సీతమ్మధార : తెనాలి ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా తైక్వాండో సిటీ లీగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల సివిల్ విభాగం ఫైనలియర్ విద్యార్థిని కె.మౌనిక మంచి ప్రతిభ కనబరిచి 67 కేజీల విభాగంలోరాష్ట్రస్థాయిలో బంగారు పతకాన్ని సాధించింది. ఉత్తరాఖండ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే మన్యం జిల్లా పార్వతీపురంలో నిర్వహించిన 31వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో ఇంజనీరింగ్ కళాశాల ఇఇఇ విభాగం ఫైనలియర్ విద్యార్థి కె.బాలు 60-65 కేజీల విభాగంలో రజత పతకాన్ని సాధించాడు. పతకాలతో కళాశాల ప్రతిష్టను ఇనుమడింజేశారని విద్యార్థులను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. మధుకుమార్ అభినందించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. దీపక్ చౌదరి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ యు.గంగాభవాని పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యకారిణి అపర్ణకు నారీ శక్తి పురస్కారం

కూచిపూడి నృత్యకారిణి అపర్ణ

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి ఏడోవార్డు పిలకవాని పాలేనికి చెందిన నాగోతి నర్సింగ రావు మనవరాలు, కూచిపూడి నృత్యకారిణి ఎస్-ఎస్‌వి అపర్ణ న్యూఢిల్లీకి చెందిన దూస్రా దశక్ ఫౌండేషన్ నారీశక్తి పురస్కారానికి ఎంపికైంది. దేశంలో పలు రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు అందించే ఈ అవార్డుకు నృత్యవిభాగంలో అపర్ణను ఎంపిక చేసినట్లు నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందింది.. వచ్చేనెల 27న ప్రముఖసినీ నటి మయూరి సుధాచంద్రన్ అవార్డు అందజేస్తారని వెల్లడించారు. కూచిపూడి నృత్యకారిణి అపర్ణ ఇప్పటికే పలు రాష్ట్రాల్లో 500కు పైగా ప్రదర్శనలు ఇచ్చి,లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్, మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్, సౌత్ ఇండియా ఆర్ట్ అండ్ కల్చర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదుతోపాటు పలు అవార్డులు సొంతం చేసుకున్నారు. ఇటీవల బెంగుళూరులో సౌత్ ఇండియా ఉమెన్ ఎచీవర్ అవార్డు పొందారు. 104 ఏరియాలో అపర్ణ చదివే నేవీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు అపర్ణను అభినందించారు.

రైల్వేజోన్ పనుల అడ్డగింత

రైల్వే జోన్ పనులను అడ్డుకుంటున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ పరిసర ప్రాంతంలో రైల్వే జోన్ కార్యాలయాల నిర్మాణ పనులను స్థానిక కృష్ణాపురం గిరిజనులు మంగళవారం అడ్డుకున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక భాగంలో రైల్వే జోన్‌కు 52 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇటీవల రైల్వే శాఖ ఇక్కడ పనులను ప్రారంభించింది. 1976లో వ్యవసాయం చేసుకునేందుకు 66 ఎకరాలను తమకు కేటాయించారని, ఇపుడు ప్రత్యామ్నాయంగా చూపకుండా, తమ సాగు, అధీనంతో ఉన్న భూములను కేటాయించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని నినాదాలు చేసారు.

కొత్త ఆసుపత్రికి వెళ్లాలంటే ఇబ్బందులు

- అత్యవసర చికిత్సలు పాత ఆసుపత్రిలో కొనసాగించాలి
- సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-యలమంచిలి

రవాణా సౌకర్యం లేని ప్రాంతంలో కొత్త ఆసుపత్రి నిర్మించడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల అత్యవసర చికిత్సలు పాత ఆసుపత్రిలో కొనసాగించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.శివాజీ మాట్లాడుతూ కొత్త ఆసుపత్రి నిర్మాణంతో రోగులకు, వైద్య సిబ్బందికి అదనపు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కొత్త ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి ప్రజాభిప్రాయం సేకరించకుండా కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారని దుయ్యబట్టారు. అందరికీ అందుబాటులో నగరం నడిబొడ్డునుండే ఆసుపత్రిని అనాలోచిత నిర్ణయంతో మారుమూల ప్రాంతంలో నిర్మించారని తెలిపారు. కొత్త ఆసుపత్రికి వెళ్లాలంటే రవాణా గుదిబండగా మారిందన్నారు. ఇక వర్షాకాలమైతే జారు బురదల్లో వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని అత్యవసర చికిత్సలన్నీ పాత ఆసుపత్రిలోనే కొనసాగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జానకి, నూకరత్నం, లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

జిల్లా పోలీసులకు ఉగాది పురస్కారాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉగాది పండుగను పురస్కరించుకుని, అనకాపల్లి జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతిభావంతమైన పోలీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసు సేవా పతకాలను ప్రకటించింది. జిల్లా పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన 8 మంది పోలీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకం, సేవా పతకాలు ప్రకటించింది. జిల్లా పోలీసు విభాగం పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకానికి బి.శ్రీనివాసరావు (ఎఎస్ఐ, అనకాపల్లి స్పెషల్ బ్రాంచ్), సేవా పతకాలకు ఎల్.మన్మధరావు (రిజర్వ్ ఇన్‌స్పెక్టర్), కె.భోజరాజు, కెజెఐజె.ప్రదీప్ కుమార్, పి.సత్యనారాయణ, వై.ఆనందరావు, ఈ.తవిటి నాయుడు, ఆర్.రమణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో మరింత ఉన్నతంగా నిలిపినట్టు చెప్పారు. పురస్కారాలు అందుకున్న వారిని అభినందిస్తూ, వారి సేవలను ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ ఇదే కర్తవ్యపరమైన జోష్‌తో పని చేసి, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలను అందించాలని కోరారు.

టీచర్ల బదిలీలు, ప్రమోషన్లపై శాశ్వత చట్టం అభినందనీయం : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లపై శాశ్వతమైన ఒక చట్టం చేయడం ఆహ్వానించదగ్గ విషయమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం శాశ్వతమైన నియమ నిబంధనలకు అనుగుణంగా, ఒకే సమయంలో ట్రాన్స్ఫర్లు ప్రమోషన్లు చేస్తామని ప్రభుత్వం ఒక సౌకర్యం కల్పించడం చాలా మంచి విషయమని తెలిపారు. అయితే ప్రభుత్వం భవిష్యత్తులో ఈ చట్టాన్ని అధిగమించి, కౌన్సిలింగ్ విధానాన్ని తుంగలో తొక్కి డైరెక్ట్ ట్రాన్స్ఫర్లు చేయకూడదని హితవుపలికారు. ఈ బదిలీలలో మారిన నిబంధనల మేరకు బ్లైండ్ టీచర్లు తమ అభీష్టానికి అనుగుణంగా ఒకే పాఠశాలలో ఎన్ని రోజులైనా పని చేసే సౌకర్యం కోల్పోయారని, చట్టపరంగా విడిపోయిన మహిళలు ప్రిఫరెన్షియల్ క్యాటగిరి కోల్పోయారని, వారికి ఆయా సౌకర్యాలు తిరిగి పునరుద్ధరించాలని చిన్నబ్బాయి కోరారు.

డైట్ కళాశాల విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి-అనకాపల్లి స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులకు తూర్పు నావికా దళం, ఇండియన్ నేవీ వారి సహకారంతో పారిశ్రామిక సందర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఇండియన్ నేవల్ షిప్ ముంబైని సందర్శించారు. చీఫ్ కమాండ్ ఆఫీసర్ సందీప్ కుమార్ మ మాట్లాడుతూ ఇండియన్ నేవీ ప్రాముఖ్యత, భారతీయ నావికా దళం దేశానికి ఎలాంటి సేవలు అందిస్తున్నది తెలియజేశారు. ఇంజనీరింగ్ విద్యార్థుల పరిశోధనలు దేశానికి, మిలటరీకి చాలా అవసరమని, విద్యార్థులందరూ డిఫెన్స్ విభాగంలో ఉద్యోగం సంపాదించాలని ఆకాంక్షించారు. అసిస్టెంట్ వార్ఫేర్ ఆఫీసర్ వినాయక్ దేశాయ్ మాట్లాడుతూ ఐఎన్ఎస్ ముంబై రాడార్ కెపాసిటీ, యుద్ధ శక్తి సామర్థ్యాలు, భూగర్భ జలాల్లో యుద్ధనౌక శత్రువులను ఎదుర్కునే విధానాలు విద్యార్థులకు వివరించారు. సచిన్ కుమార్ భారతీయ తూర్పు నావికా దళం అత్యవసర సమయంలో తీసుకుంటున్న భద్రత, జాగ్రత్తలపై విద్యార్థులకి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్. ఆర్ వైకుంఠ రావు, ఇండియన్ నేవీ సిబ్బంది రేర్ అడ్మిరల్ దినేష్, కమాండర్ షాలిని నైర్, విద్యార్థులు, వై.చైతన్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. హేమలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్కాలర్ షిప్‌లు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో ఆ సంస్థ యాజమాన్యం మంగళవారం ఎఎంఎఎల్ కాలేజ్ డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థినులకు స్కాలర్ షిప్ పంపిణీ చేసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మల్ల సురేంద్ర మాట్లాడుతూ మలబార్ గోల్డ్ డైమండ్స్ మేనేజ్మెంట్ షోరూం యాజమాన్యం ప్రతి ఏడాది తమ ఆదాయంలో 5 శాతం ప్రభుత్వ కళాశాలల విద్యార్థినుల స్కాలర్‌షిప్‌లకు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ముజమ్మిల్, జి ఎస్ నాయుడు, ఎఎంఎఎల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, వైస్ ప్రిన్సిపాల్, కళాశాల సూపరింటెండెంట్ అనురాధ పాల్గొన్నారు.

వాడ చీపురుపల్లిలో ఎల్‌టిసి ట్రైనింగ్

ప్రజాశక్తి-పరవాడ : స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని వాడచీపురుపల్లి గ్రామపంచాయతీ ఎన్‌డబ్ల్యుపి షెడ్‌లో ఎల్‌టిసి ట్రైనింగ్ ప్రోగ్రామ్ మంగళవారం నిర్వహించారు. పరవాడ మండలంలోని అన్ని పంచాయతీలు నుండి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ఇందులో పాల్గొన్నారు. ఎంపిడీవో ధర్మారావు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, శ్రీరామమూర్తి, ఉప సర్పంచ్ కోహిడి సత్యనారాయణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పాడి రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి

మాట్లాడుతున్న డాక్టర్ సౌజన్య

ప్రజాశక్తి -అనకాపల్లి : పాడి రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సౌజన్య అన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం అభ్యుదయ పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు, గ్రోత్ రేటు పెంచుకునేందుకు పాడి రైతులు సంఘాలుగా ఏర్పడాలని సూచించారు. ఎన్డిడిబి, ఏపీడిడిసిఎఫ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సంఘమిత్ర, ఫోడర్, ఎఫ్‌పిఓ షేర్లు కొనుగోలు చేసి తద్వారా మేలు జాతి బహు వార్షిక పశు గ్రాసాలను పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. తక్కువ ధరకే నాణ్యమైన పశుదానా, సైలేజ్, టిఎంఆర్ వంటి నాణ్యమైన ఎరువులు పురుగుమందులు అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో పశు వైద్యాధికారులు అనిల్, రామారావు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

మాట్లాడుతున్న తహశీల్దారు అంబేద్కర్

ప్రజాశక్తి-పరవాడ

రీ సర్వేతో భూముల సమస్యలు పరిష్కారమవుతాయని తహశీల్దారు అంబేద్కర్ అన్నారు. మండలంలోని రావాడ రెవిన్యూలో చేపడుతున్న భూ సర్వేపై రైతులకు అవగాహన కల్పించడానికి మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రావాడ రెవెన్యూలో 494 సర్వే నెంబర్లు, 2030 ఖాతా నెంబర్లు, 3682 ఎకరాల భూమి ఉందని, అందులో ప్రభుత్వ భూమి దాదాపు 1100 ఎకరాలు ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ రైతులు దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని సూచించారు. రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేష్ నాయుడు, మండల సర్వేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వే టీమ్‌లు కొలతలు వేసే రోజు రైతులంతా తమ పొలాలకు వెళ్ళి తమ వద్ద ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలు, లింక్ డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ చూపించాలని సూచించారు. కార్యక్రమంలో రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న, వైసిపి మండల అధ్యక్షులు కోన రామారావు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, విఆర్ఓ సాయి, గ్రామ సర్వేయర్ అజయ్ కుమార్, సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

కునాల్ కమ్రా స్టూడియోపై దాడి తగదు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ముంబైలోని హేబిటేట్ స్టూడియోపై కమలం పార్టీ, శివసేన షిండే గ్రూపు, ముంబై మున్సిపల్ సిబ్బంది కలిసి మూక దాడికి పాల్పడి కూల్చి వేయడాన్ని, స్టాండప్ కమెడియన్ కమ్రాను బెదిరించడాన్ని ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఖండించింది. కళాకారులపై ఇటువంటి దాడులు చేయడం ద్వారా భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకొని కళాకారుల సృజనాత్మకతను, ప్రదర్శనకారుల స్వేచ్ఛను గొంతు నొక్కడం లాంటిదని, ఈ చర్యలను కవులు, కళాకారులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు, అభ్యుదయ కాముకులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కునాల్ కమ్రాకు అండగా నిలవాలని ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.చంటి, అధ్యక్షులు జి.రమణ, గౌరవాధ్యక్షులు దండు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.సత్యనారాయణ, సహాయ కార్యదర్శి జి.స్టాలిన్ కోరారు.

పి4 సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పరవాడ : పి4 సర్వేను సద్వినియోగం చేసుకోవాలని జనసేన 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వార్డు పరిధిలోని దేశపాత్రునిపాలెం రెండు సచివాలయాల పరిధిలో మంగళవారం సభ జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పి4నకు ఎవరైనా అర్హులు ఉంటే నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన 79వ వార్డు అధ్యక్షులు పిల్ల శివ పాల్గొన్నారు.

కూలి డబ్బులు ఎగేసిన

ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

సిఐటియు జిల్లా నేతలు శ్రీనివాసరావు, వరలక్ష్మి

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కాటాల వద్ద పని చేసిన కూలీలకు, డ్రైవర్లకు వేతనాలను ఎగ్గొట్టి పరారైన ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, రైతు నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చెరకు కాటాల వద్ద చెరకును ఫ్యాక్టరీకి తరలించే ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ ఫ్యాక్టరీ నుండి పేమెంట్ అందుకుని, కాటాల వద్ద కష్టపడిన కూలీలకు, డ్రైవర్లకు డబ్బులు సుమారు రూ.12 లక్షలు చెల్లించకుండా వెళ్లిపోయాడని తెలిపారు. ఫ్యాక్టరీ ఎమ్‌డి సైతం కూలీలుకు, డ్రైవర్లకు బాకీలు ఉన్నాయో లేదో తెలుసుకోకుండా ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్‌కు పూర్తి బకాయిలు చెల్లించి చేతులు దులుపుకోవడం బాధ్యతారాహిత్యమన్నారు. దీనిపై యాజమాన్యం బాధ్యత వహించి కూలీలకు, డ్రైవర్లకు కూలి డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే కూలీలు, డ్రైవర్లతో కలిసి ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నేత శ్రీనివాసరావు, చిత్రంలో వరలక్ష్మి, నాగిరెడ్డి సత్యనారాయణ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.
- ప్రజాశక్తి-అనకాపల్లి

పరదేశమ్మను దర్శించుకున్న వైసిపి నేత భరత్ కుమార్

పరదేశమ్మను దర్శించుకున్న భరత్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం శంకరం గ్రామ దేవత శ్రీపరదేశమ్మ జాతర మహెూత్సవం సందర్భంగా మంగళవారం వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద, నాయకులు మలసాల కిషోర్, మలసాల కుమార్ రాజా, చిన్ని వల్లభ నారాయణరావు, పసుపులేటి రామకృష్ణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోషకాహారం ఎంతో అవసరం

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : పిల్లలు శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంత అవసరమన్న విషయాన్ని ప్రతి అంగన్వాడీ బోధకులతో పాటు తల్లులు తెలుసుకోవాలని సమగ్ర శిశు అభివృద్ధి అధికారి వి.మంగతాయారు అన్నారు. పోషణ్ బీ - పఢాయి బీ శిక్షణా కార్యక్రమం మూడవ బ్యాచ్ రెండవ రోజు మంగళవారం జరిగింది. 0-5 సంవత్సరాల లోపు పిల్లలకు పోషకాహారం ప్రాముఖ్యత, పోషకాలు, ఐరన్ లోపం, రక్తహీనత, విటమిన్-ఏ, విటమిన్-డి, అయోడిన్, కాల్షియం వాటిని పిల్లల్లో ఎంత శాతం ఉన్నాయి, వయసుకు తగ్గా బరువు, శారీరక, మానసిక ఎదుగుదల, మాతా శిశు సంరక్షణ వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు రాములమ్మ, ఆదిలక్ష్మి, సుశీల, శ్రీలక్ష్మి, 46 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడిపాలెం హైస్కూల్‌లో మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం మామిడిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రామ సర్పంచ్ పూడి పరదేశి నాయుడు సౌజన్యంతో మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌బి శ్రీధర్ మాట్లాడుతూ ఒంటిపూట బడులు ప్రారంభమైన దగ్గరనుంచి ప్రతిరోజు 650 మంది పిల్లలకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ సర్పంచ్ పరదేశి నాయుడుని ఆదర్శంగా తీసుకొని సామాజిక సేవ చేయడం అందరూ అలవర్చుకోవాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్పంచ్ పరదేశినాయుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బాబు, సుబ్రహ్మణ్యం, వసంతరావు, గౌరీ, కరుణ జ్యోతి, స్వామి, విజయలక్ష్మి, కెనడి, ప్రసాద్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గావు పండగ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో గున్నెంపూడి గ్రామంలో గ్రామస్తులు మంగళవారం గావు పండగను ఘనంగా జరుపుకున్నారు. శతకం పట్టు వద్ద అరటి గెలలు, రకరకాల పండ్లుతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్‌ఎన్.రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుమ్మలపూడి రాము, ముచ్చకర్ల నాయుడు, గుండు గణేష్, పాలనాయుడు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

వికలాంగ ఉపాధ్యాయులకు ఎలక్ట్రానిక్ మోటార్ వీల్ చైర్స్ బహూకరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్చుతాపురం వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న ముగ్గురు వికలాంగులకు మంగళవారం ఇమ్మిరీస్ ఇండియా, ట్రీ ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2 లక్షల రూపాయలు విలువచేసే మూడు ఎలక్ట్రానిక్ మోటార్ వీల్ చైర్స్‌ను బహూకరించారు. మండల వికలాంగుల ఆశ్రమ పాఠశాలను మంగళవారం పరిశ్రమ ప్రతినిధులు సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇమ్రిస్ ఆర్‌పిసి ఆఫ్ డైరెక్టర్ డార్క్ హెండెన్ హివర్ విచ్చేశారు. ఈ సందర్భంగా జాతీయ అవార్డు గ్రహీత పిఎస్టి పట్నాయక్‌తో వికలాంగుల సమస్యలపై మాట్లాడారు. టిఐ ఫౌండేషన్ సిఈఓ తన్వీర్ ఇమాందార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియా చైర్మన్ బ్రిజ్వాని, విశాఖ ప్లాంట్ హెడ్ రఘుకుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం

ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

ప్రజాశక్తి- అనకాపల్లి : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు అన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ అనకాపల్లి జిల్లా సర్వసభ్య సమావేశం మంగళవారం పట్టణంలోని తాటికొండ నూకయ్యశెట్టి మెమోరియల్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత అత్యంత కీలకమైందన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. జర్నలిస్టులకు వైద్యం, బీమా సదుపాయాల విషయంలో ప్రభుత్వాలు అలసత్వం చూపడం తగదన్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కొండబాబు, గంట్ల శ్రీనుబాబు, విశాఖ, అనకాపల్లి జిల్లాల నాయకులు పి.నారాయణ, ధవళేశ్వరపు రవికుమార్, ఈశ్వరరావు, బి.వెంకటేష్, జి.శ్రీనివాసరావు, ఎ.సాంబశివరావు, ఆనంద్, జి.రాంబాబు, బ్రాడ్ కాస్టింగ్ అసోసియేషన్ నాయకులు ఈశ్వరరావు, మదన్, స్మాల్ పేపర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

నూతన కమిటీలు ఎన్నిక

అనంతరం అనకాపల్లి జిల్లా ఫెడరేషన్, బ్రాడ్ కాస్టింగ్ అసోసియేషన్ కార్యవర్గాల ఎన్నిక జరిగింది. ఏపీ బ్రాడ్కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జల్లా అధ్యక్షునిగా ఎస్‌కె.చాంద్ బాషా (అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్వరరావు (నర్సీపట్నం), ఉపాధ్యక్షులుగా ఎంవీ రమణ (నర్సీపట్నం), సహాయ కార్యదర్శిగా పి.రామారావు (అనకాపల్లి), కోశాధికారిగా కె.శేఖర్ (అనకాపల్లి), కార్యవర్గ సభ్యులుగా షణ్ముఖ, ఎడ్ల రామకృష్ణ, జామి అప్పలరాజు, మూర్తి ఎన్నికయ్యారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులుగా భీమరశెట్టి వెంకటేష్ (అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా ఖాదర్ (నర్సీపట్నం), ఉపాధ్యక్షులుగా ఎల్.కృష్ణ (పెందుర్తి), ఆర్.చినరామ్మూర్తి (నర్సీపట్నం), సహాయ కార్యదర్శులుగా ఎం.అజయ్ (అనకాపల్లి), వై.ధర్మారావు (మాడుగుల), డి.అప్పారావు (పాయకరావుపేట), వి.జగదీశ్ (చోడవరం), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.గణేష్ (అనకాపల్లి), కోశాధికారిగా టి.రమేష్ (అనకాపల్లి), కార్యవర్గ సభ్యులుగా వై.నాగు (అనకాపల్లి), ఎన్. త్రిమూర్తులు (నర్సీపట్నం), కె.జాన్ (మాడుగుల), శ్రీనివాస్ (ఎలమంచిలి), బి.మధు (అనకాపల్లి), పి.పూర్ణచంద్రరావు (అనకాపల్లి) ఎన్నికయ్యారు.

మాట్లాడుతున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

మున్సిపాలిటీ సమావేశ మందిరాన్ని నిర్మించాలి

- ఏళ్ల తరబడి గుడ్డతెరల మధ్య సెల్లార్‌లో సమావేశాలా?

- కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ గుప్తా

ప్రజాశక్తి-యలమంచిలి : చిన్న చిన్న పెళ్లిళ్ల, పేరంటాలు జరిగే తంతులాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు గుడ్డ తెరలు కట్టుకొని సెల్లార్‌లో నిర్వహించడం దురదృష్టకరమని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపు నాగేశ్వర గుప్తా అన్నారు. సమావేశ మందిర నిర్మాణానికి ఏడేళ్ల క్రితం రూ.50 లక్షలు మంజూరైనా నేటికీ నిర్మాణం చేయకపోవడం అధికార్ల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఆయన ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ డబ్బులున్నా సమావేశ మందిరం నిర్మించకుండా తాత్సారానికి కారకులెవరని నిలదీశారు. మండల డిఇ మాధవరావు మాట్లాడుతూ టెంటర్లు పిలిచినా కాంట్రాక్టర్లెవరూ ముందుకు రావడం లేదని చెప్పారు. ఆ నిధులు సరిపోవని తెలిపారు. వచ్చే నెలలో సమావేశం ఇదే తరహాలో తెరలు కట్టి నిర్వహిస్తే సమావేశాన్ని బహిష్కరిస్తానని కమిషనర్‌ను గుప్తా హెచ్చరించారు. యలమంచిలిలో ప్రభుత్వ కార్యాలయాలు కోట్ల రూపాయలు పన్నులు బాకీ పడ్డా వాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో చెప్పాలని సభ్యులు ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయ విద్యుత్ కోసం గతంలో ఏర్పాటు చేసిన పివి కాంప్లెక్స్‌పై ఏర్పాటు చేసిన లక్షల ఖరీదు చేసే విద్యుత్ ప్యానళ్లను గాలికొదిలేయడంపై సభ్యులు నిలదీశారు. త్వరలోనే వాటికి పరిష్కారం చేస్తామని కమిషనర్ చెప్పారు. దిమిలి రోడ్ మార్గంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అనంతరం 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టారు. రెవెన్యూ బడ్జెట్ 2024-25కు గాను సవరించిన బడ్జెట్‌ను రూ.83 కోట్ల 77 లక్షల 823గా పేర్కొన్నారు. రానున్న అంచానా బడ్జెట్ రూ.9 కోట్ల 41 లక్షల 38 వేల 500గా సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, సిడిపిఒ ఇందిరాదేవి, వెలుగు ఏపిఒ రాణి, మున్సిపల్ శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టిపిఒ శ్రీలక్ష్మి, ఏఈ సుబ్బారావు, టౌన్ పోలీసులు, రెవెన్యూ అధికార్లు పాల్గొన్నారు.

అక్రమ బోర్‌వెల్‌ను తొలగించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణంలోని బోయగూడెం సీతారామ దేవస్థానానికి చెందిన సర్వేనెంబర్ 184లో ఉన్న నూతిలో అక్రమ తవ్విన బోర్వెల్‌ను తక్షణమే తొలగించాలని స్థానికులు ఆర్‌డిఒ షేక్ ఆయేషాను వేడుకున్నారు. ఇటీవల సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఈ ప్రాంతాన్ని సందర్శించిన సిపిఎం నాయకులు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్డిఓ ఆయేషా మంగళవారం తహాశీల్దారు విజయ్ కుమార్‌తో కలిసి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ తమ దేవస్థానానికి చెందిన నూతిలో 2004 నుంచి బుద్ధ రమణాజీ అనే వ్యక్తి 150 అడుగుల లోతులో బోర్వెల్ వేసి ఆ నీటిని అమ్ముకుంటున్నారని, దీని వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి సుమారు 200 కుటుంబాలకు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్, డిఆర్‌ఓ, ఆర్‌డిఓ, తహాశీల్దారు కార్యాలయాల్లోనూ, ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ కార్యాలయాల్లోనూ గ్రీవెన్స్‌లో పలు మార్లు వినతులు ఇచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు గత ఏడాది అక్టోబర్ 29న విద్యుత్ డిస్ కలెక్ట్ చేశారని, అయినా తిరిగి పది రోజుల్లోనే ఆర్డీవో మౌఖిక ఆదేశాల మేరకు విద్యుత్తు కనెక్షన్ పునరుద్ధరించారని తెలిపారు. తమకు రాజకీయ బలం, ఆర్థిక బలం లేకపోవడంతో అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై ఆర్డీవో ఆయిషా స్పందిస్తూ ఇరు పార్టీలను పిలిచి తగిన విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్వా కన్వీనర్ బొప్పే ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, సిపిఎం నాయకులు కాళ్ల తేలయ్య బాబు, గుడాల సత్యనారాయణ, చింత శివ, చింత హరినాథ్, దుర్గాప్రసాద్, దూలం జగదీష్, మైపాల నాయుడు, వరలక్ష్మి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎఐవైఎఫ్ జాతీయ మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తిరుపతిలో మే 15,16, 17 తేదీల్లో జరగనున్న ఎఐవైఎఫ్ జాతీయ 17వ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి కోరారు. అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం మహాసభకు సంబంధించిన 'లోగో'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగ యువత పెరుగుతుందన్నారు. దేశ సంపదను అదాని, అంబానీకి ఏవిధంగా కట్టపెట్టాలి అనే ఆలోచన తప్ప, దేశప్రజల సమస్యలు పాలకులకు పట్టడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు వై.రాంబాబు, కె.అచ్యుతరావు, యు.నాగరాజు, మధు, శ్రీను, అశోక్ శివ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

27న సబ్బవరం వైస్ ఎంపీపీ ఎన్నిక

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి ఈ నెల 27న ఎన్నిక నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 27న గురువారం ఉదయం 10 గంటలకు నామినేషన్లు స్వీకరించి, 12 గంటలకు పరిశీలిస్తామని, ఒంటి గంటలోపు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించి, వెంటనే అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు. అనంతరం ఒంటి గంటకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభించి పూర్తయిన వెంటనే ఫలితాన్ని ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ ఎన్నిక చేతులెత్తడం ద్వారా జరుగుతుందని తెలిపారు. మండలంలో 19 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారని, వారిలో 10 మంది హాజరైతే కోరం సరిపోతుందని, ఈ ఎన్నిక నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఏదైనా అనివార్య కారణాలవల్ల సభ్యులు హాజరు కాకపోతే, మర్నాడు 28న ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవి ఎన్నికకు ప్రిసైడింగ్ అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండలం ప్రత్యేక అధికారి ఎస్. రమామణి వ్యవహరించనున్నారని చెప్పారు. చొక్కాకుల గోవింద వైస్ ఎంపీపీ-2 పదవికి రాజీనామా చేయడం వల్ల ఈ ఎన్నిక నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శివ నారాయణ ప్రసాద్, పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు

ప్రజాశక్తి-పరవాడ : ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి వెళ్లి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కూండ్రపు కృష్ణంనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. నేటి నిరుద్యోగ యువత, విద్యార్థులు ఈజీ మనీకి అలవాటు పడి ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని, కొంత మంది సెలబ్రిటీలు కూడా ప్రచారం చేయడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో అప్పులు పాలై వాటిని ఎలా తీర్చుకోవాలో తెలియక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నిర్వాసితులకు నష్టపరిహారం నగదు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి

ప్రజాశక్తి-మునగపాక : అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు నష్టపరిహారాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక మెయిన్ రోడ్‌లో గల తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ విస్తరణలో భాగంగా భూములు, ఇల్లు కోల్పోతున్న నిర్వాసితులకు గతంలో గ్రామసభలు నిర్వహించి నేరుగా రైతులందరికీ వారి అకౌంట్లో నగదు జమ చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నగదు జమ చేయకుండా టిడిఆర్ బాండ్లు ఇస్తామని ప్రకటనలు చేయడం నిర్వాసితులను రోడ్డున పడేయడమే అవుతుందన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా సుమారు 1200 మంది నిర్వాసితులకు గతంలో చేసిన ఒప్పందం ప్రకారం వారి ఖాతాలో డబ్బులు జమ చేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జీడి మామిడి రైతులను ఆదుకోవాలి

సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -కొత్తకోట:జీడి మామిడి గిరిజన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుండి గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రావికమతం తహ సీల్దార్ కార్యాలయం వద్ద పలు గ్రామాల ఆదివాసీ గిరిజన రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ, మండలంలో టి అర్జాపురం, కొట్నాబెల్లి, చీమలపాడు, ధర్మవరం, జెడ్. బెన్నవరం, కవగుంట పంచాయతీల పరిధిలో సుమారు 18 గ్రామాలకు చెందిన ఆదివాసి గిరిజనులు సుమారు 800 ఎకరాల్లో 400 మంది గిరిజనులు జీడిమామిడి తోటలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వీరికి గత కొన్నేళ్లుగా డి పట్టా ఆర్‌వోఎఫ్ఆర్ ఫారెస్ట్ పట్టాలు కలిగి ఉన్నారని తెలిపారు. ఈ మధ్య కాలంలో ఆయా తోటలకు అగ్గి, కాడ తెగుళ్ళు సోకడంతో జీడి మామిడి తోటలకు పూత దశలోనే నష్టం కలిగిందని పేర్కొన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ కావడంతో బ్యాంకు రుణాలు మంజూరు కాక ప్రైవేటు వ్యాపారస్తులను ఆశ్రయించి అధిక వడ్డీ లకు అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చిందని వాపోయారు. తోటలకు తెగుళ్ల సోకడంతో నష్టం వాటిల్లి ప్రయివేట్ వ్యాపారులకు రుణాలు చెల్లించ లేక పోతున్నామని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కవగుంట, కొట్నాబెల్లి రెవిన్యూ పరిధిలో జగనన్న రీ సర్వేలో పట్టాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ భూమిగా వెబ్లాండ్ రికార్డుల్లో నమోదు చేశారని, మరో 20 ఎకరాల భూమిని గిరిజనేతరులైన రియల్ ఎస్టేట్ కుటుంబాలకు పట్టాలిచ్చారని, దీనిపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమన్నారు.తోటల పై భీమా పథకం వర్తింపుకు వెబ్ ల్యాండ్ లో నమోదైన తప్పు కారణంగా రైతులు నష్ట పోతున్నారని తెలిపారు. తక్షణమే వెబ్ ల్యాండ్ లో తప్పులు సరిదిద్దాలని డిమాండ్ చేశారు. బాదంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 41లో 5-82 సెంట్లు ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ చరణ్ గ్రూపు సంస్థ ఆక్రమించిందని ఈ భూమిలో గిరిజనులకు ఇల్లు స్థలాల పట్టాలు ఇచ్చి ఎన్టీఆర్ గృహ నిర్మాణం చేయాలన్నారు. లేదంటే వచ్చే నెల మొదటి వారంలో సిపిఎం, గిరిజన సంఘం, ఇతర ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో చరణ్ గ్రూప్ ఆక్రమించిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.నాన్ షెడ్యూల్ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు రెవెన్యూ అధికారులతో జత కట్టి గిరిజన భూములను రియల్ ఎస్టేట్, గిరిజనేతరులకు అప్పగిస్తున్నారని. వీటిపై జిల్లా జాయింట్ కలెక్టర్ స్వయానా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బివి రమణకు వినతిపత్రం అందజేశారు... దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ, గిరిజనులు నష్టపోయిన పంటకు జిల్లా కలెక్టర్ కు నివేదిక ఇస్తామని తెలిపారు. తప్పులను సరి చేసి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాంగి చంద్రయ్య, గెమిలి వాసు, గిరిజన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

మాట్లాడుతున్న ఎంపిడిఒ సీతారామరాజు

చెత్త సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి:పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలని నక్కపల్లి, కోటవురట్ల మండలాల ఎంపీడీవోలు డి.సీతారామరాజు, జి.కాశీవిశ్వనాథరావు అన్నారు. నక్కపల్లి డంపింగ్ యార్డ్ వద్ద మంగళవారం కోటవురట్ల మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్‌లకు గ్రామాల్లో తడి పొడి చెత్త సేకరణ, సంపద కేంద్రం నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ముందుగా నక్కపల్లి గ్రామంలో వీధుల్లో పర్యటించి తడి, పొడి చెత్త సేకరణ పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించడం, చెత్తను వేరు చేయడం, తడి పొడి చెత్తను వేరువేరుగా పిట్స్‌లో నింపడం, వర్మి కంపోస్టు తయారు చేయడం వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి పంచాయతీ సర్పంచ్ వీసం రాజు, ఇంచార్జ్ ఈఓపిఆర్డి ఎం.శ్రీను పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్న

26న జాబ్ మేళా

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలోని రిషి డిగ్రీ కాలేజ్ లో ఈనెల 26వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని రిషి విద్యాసంస్థల యాజమాన్యం మంగళవారం విలేకరులకు తెలియజేసింది. స్పీకర్ క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళా గోడపత్రికను స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నం ప్రాంతంలో చదువుకున్న యువత జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ జాబ్ మేళాలో సుమారు 18 బహుళ జాతీయ కంపెనీలు 1,800 ఖాళీలతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. 10వ తరగతి నుండి పీజీ వరకు చదువుకున్న వారు, 18 నుండి 40 సంవత్సరాల వయస్సు గల యువతి, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు.నైపుణ్య అభివృద్ధి జిల్లా అధికారి ఎన్.గోవిందరావు మాట్లాడుతూ, విద్యా సర్టిఫికెట్లు, బయోడేటాతో జాబ్ మేళాకు హాజరవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాలేజ్ కరస్పాండెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలో సౌకర్యాల కల్పనకు కృషి

-స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు- పలువురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో క్లాస్ రూమ్స్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తానని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందిన వారికి ఉద్యోగ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, 1985లో తాను నర్సీపట్నంలో పాలిటెక్నిక్ కాలేజీ స్థాపించామని గుర్తు చేసుకున్నారు. ఆరంభంలో డిప్లొమా ఈసీఈ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులు మాత్రమే ఉండగా, 1986లో మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సును ప్రారంభించామని తెలిపారు. ఈ ఏడాది క్యాంపస్ సెలెక్షన్లలో ఈసీఈ బ్రాంచ్‌లో 50 మంది, మెకానికల్ బ్రాంచ్‌లో 39 మంది, మైనింగ్ బ్రాంచ్‌లో 6 మంది సహా మొత్తం 95 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు. నర్సీపట్నం పాలిటెక్నిక్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఏఐ కోర్సులు కూడా తీసుకు రావడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి రమణ, తహసిల్దార్ రామారావు, టెక్నికల్ ఎడ్యుకేషన్ ఏయూ ఆర్ జె డి నాగేశ్వరావు, ప్రిన్సిపల్ జీవి రామచంద్రరావు, హెచ్ఓడీలు సిహెచ్ వి నరసింహం, రవీంద్రనాథ్, ఫణి కృష్ణ, కైట్ కాలేజ్ డైరెక్టర్ సురేశ్, ప్రిన్సిపల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-యస్.రాయవరం :మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన కంటి పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ నాయుడు తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కంటి వైద్యాధికారి వెంకట్రావు మాట్లాడుతూ, ఈ కంటి పరీక్షలకు సుమారు 30మంది హాజరు కాగా అందులో నుండి 20మందిని విశాఖపట్నం తరలించినట్టు తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి వెంకట్రావు తెలిపారు.

బస్‌లో తరలిస్తున్న వైద్యులు

మాట్లాడుతున్న తహసిల్దార్ నరసింహ మూర్తి

భూ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -నక్కపల్లి:రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసిల్దార్ నరసింహమూర్తి అన్నారు. మండలంలోని చిన్న రామభద్రపురం గ్రామంలో మంగళవారం భూముల రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రైతులకు అవగాహన కల్పించారు. సర్వే బృందం గ్రామంలో భూములు రీ సర్వే చేపడతారని, సంబంధిత రైతులు రికార్డుల ప్రకారం సర్వే చేయించుకుని సహకరించాలన్నారు. రీ సర్వేపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆర్ఐ కన్నబాబు, సర్వేయర్ సత్తిబాబు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన పంచాయతీల్లో రీ సర్వే చేయాలి

నినాదాలు చేస్తున్న నాయకులు, రైతులు

ప్రజాశక్తి - చీడికాడ: చీడికాడ మండలంలో గిరిజను లు ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో రీ సర్వే చేసి భూ సమస్యలు పరిష్కారం చేయాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్, మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు మాట్లాడుతూ, కోణాం, సిరిజాం, వీరభద్ర పేట గ్రామాల్లో రీ సర్వే వెంటనే ప్రారంభం చేసి సాగులో ఉన్న వారందరికీ సాగుబడి నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని, గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులన్నింటికీ పరిష్కారం చూపాలన్నారు.పోడు భూములు సాగు చేసుకుంటున్న ప్రతి ఒక్కరికి పట్టాలు ఇవ్వాలని, జీడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జీడిపిక్కలకి మద్దతు ధర కేజీ కి 200 రూపాయలు ఇవ్వాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి కె. కన్నబాబు, గంగరాజు, బొబ్బది నాగరాజు, సన్నిబాబు, గంగమ్మ మహలక్ష్మి, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న తహశీల్దార్

ప్రభుత్వ భూముల వివరాలు సేకరించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా ప్రభుత్వ భూములు, ప్రభుత్వ భూముల్లో నిర్మించిన భవనాల వివరాలు సమగ్ర సమాచారం సేకరించాలని తహసిల్దార్ తిరుమల బాబు సూచించారు. మంగళవారం రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన భూముల వివరాలు సేకరించాలన్నారు.ప్రభుత్వం నిర్మించి తలపెట్టిన గృహాలకు ఎల్‌పిసితో పాటు, ప్రజా పంపిణీ వ్యవస్థలో లబ్ధిదారులకు ఈ కేవైసీ సమస్యను ప్రధానంగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, ఆర్ఐ ఊర్ధ్వరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యుదయ పాడి రైతులతో సమావేశం

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక పశువుల ఆసుపత్రిలో మంగళవారం అభ్యుదయ పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పశు వైద్య సంచాలకులు ఎం వీరాజు, కోపరేటివ్ సొసైటీ సీఈవో జయచంద్ర మాట్లాడారు. పాడి రైతులు సంఘాలుగా ఏర్పడి, సొసైటీలో సభ్యులుగా చేరాలన్నారు. తక్కువ ధరకు పశుదానా, సైలెజ్ గడ్డి, టీఎంఆర్, ఎరువులు, పురుగుల మందులు పాడి రైతులకు అందిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న పశు వైద్య సంచాలకులు

ఉత్సాహంగా ఎడ్లబండ్ల పోటీలు

ప్రజాశక్తి -మాడుగుల: మండలంలోని ఎం. కోటపాడు, ఎంకెవల్లాపురం గ్రామ పరిధిలో వీరాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సుమారుగా 15 పైగా బండ్లు పాల్గొన్నాయి. గెలిపొందిన వారికి నగదు బహుమతి అందజేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పరుగులు తీస్తున్న ఎడ్లబండి

ప్రజా సమస్యలపై నిరసనల హోరు

తాగునీరు, టిడ్కో గృహాల సమస్యలపై సిపిఎం ఆందోళనలు

నర్సీపట్నంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించి గుర్తించిన సమస్యలపై మంగళవారం మండల కేంద్రాల్లో ఆ పార్టీ ఆధ్వర్యాన ధర్నాలు నిర్వహించారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

నర్సీపట్నం టౌన్: ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం నేతలు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజుల బృందం టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాల్టీలో ఏళ్ళు గడుస్తున్నప్పటికీ పేదలకు టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదాలకు అప్పగించలేదని తెలిపారు. దీంతో పేదలు ఇంటి అద్దెలు కట్టలేక ఉండడానికి ఇళ్ళు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఇళ్లను పంపిణీ చేయకపోతే గృహ ప్రవేశాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. నర్సీపట్నంలో వంద పడకల ఏరియా అసుపత్రిలో సరిపడా పారిశుధ్య కార్మికులు, స్టాఫ్ నర్సులు, వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నియోజక వర్గంలో పారెస్ట్, రెవెన్యూ పోడు సాగు చేస్తున్న గొలుగొండ, నాతవరం, నర్సీపట్నం మండలాల్లో సాగు రైతులకు పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇనాం, బంజర ప్రభుత్వ భూములలో గిరిజనలు సాగులో ఉంటే, సాగులో లేని వారి పేరున రికార్డులు ఉన్నాయన్నారు. గిరిజనులు చేస్తున్న పంట సాగును గుర్తించేందుకు రెవిన్యూ ఆదికార్లు ఇష్టపడలేదన్నారు. బలిఘట్టం, పాత కేడి పేట, జోగంపేట దళితలకు కోటవురట్ల మండలం పందూరులో ఇచ్చిన సీలింగ్ భూములను దళితులకు అప్పగించి, రక్షణ కల్పించాలన్నారు. అగ్గి తెగులుతో మాడి పోయిన జీడిమామిడి పంటకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు.

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, నర్సీపట్నంలో గ్రానైటు క్వారీ లారీలు పరిమితికి మించిన లోడ్‌తో నిబందనలకు విరుద్ధంగా నర్సీపట్నం టౌన్ మీదగా విచ్చలవిడిగా తిరుగుతు న్నప్పటికీ పోలీసు, రెవిన్యూ ఆదికార్లు పట్టించుకోలేదన్నారు. నర్సీపట్నం, బొడ్డేపల్లిలో పిల్లల పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మాకవరపాలెం మెడికల్ కాలేజ్ నిర్మాణం ప్రభుత్వం కొనసాగించాలని సూచించారు.

సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, ఉపాది హమి కూలీలకు తక్షణమే డబ్బులు చెల్లించాలని, ప్రతి జాబ్ కార్డుదారులకు 200 రోజుల పని కల్పించి, రోజుకు 600కూలి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గొలుగొండ మండల కార్యదర్శి టి. రాజుబాబు, సాపిరెడ్డి నారాయణముర్తి, ఎల్. గౌరి, కెవి సూర్యప్రభ, జి.శివ, టి.సత్తిబాబు, కె.ప్రసన్న పాల్గొన్నారు.

కశింకోటలో...



చోడవరంలో...

ఖాళీ బిందెలతో వినూత్న నిరసన

రాంబిల్లి : ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సిపిఎం ఆధ్వర్యాన ప్రజలు ధర్నా నిర్వహించారు. తాగునీటి సమస్యపై మహిళలు ఖాళీ బిందెలతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఇందులో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ మండలంలో లోవ-పాలెం, యాత కొత్తపట్నం, నేవీ కాలనీ, అప్పారాయుడుపాలెం, లాలం కోడూరు, చిన్నకలువలపల్లి గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యతో పాటు కాలుష్యం, గ్రామాల్లో డ్రైనేజీలు, వీధి దీపాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన ఆర్‌ఐ రవికుమార్, ఇఒపిఆర్‌డి, ఉపాధి హామీ ఏపీఓ తమ పరిధిలో సమస్యలను పరిష్కరిస్తామని, మిగిలిన వాటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. పది రోజుల్లో గ్రామాలకు తాగునీరు అందించకపోతే మళ్లీ మండల కార్యాలయాన్ని ముట్టడించి, వంటావార్పు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడు నాయుడు, నాయకులు ఎన్.నారాయణరావు, సిహెచ్.రామకష్ణ, డి.కాశయ్య, వై.రాము, ఎం.రమణ, లోవపాలెం, గజరెడ్డిపాలెం, యాత కొత్తపట్నం, చిన్న కలవలపల్లి, లాలంకోడూరు, మూలజంప గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

అచ్చుతాపురం : సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ప్రజా సమస్యలపై ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శంకర్రావు ఎస్ఇజెడ్ కాలనీలో రక్షిత తాగునీరు కల్పించాలని, ఎదురువాడ సర్వే నంబర్1లో బీఫారం పట్టా భూమి సమస్య పరిష్కరించాలని, ఎన్‌టిపిసి, బార్క్ నిర్వాసితుల సమస్యల పరిష్కరించాలని, మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం చెల్లించాలని కోరారు. సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, ఆర్.రాము, కె.సోమునాయుడు, తాతయ్యలు, బుద్ధ రంగారావు, ఆర్.లక్ష్మి, కృష్ణ పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డిడి.వరలక్ష్మి మాట్లాడుతూ కసింకోట భవాని కాలనీలో నిత్యం పందులు సంచరిస్తూ ఇళ్లల్లోకి కూడా చొరబడుతున్నాయని, వాటిని అరికట్టాలని కోరారు. కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు భాగ్యలక్ష్మి, ఉమా, మహాలక్ష్మి, శ్రీనివాసరావు, అఖిల, నూకాలమ్మ, ఈశ్వరరావు, కావ్య, పాల్గొన్నారు.

దేవరాపల్లి : జీడి పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, కేజీ జీడి పిక్కలకు రూ.200 ధర ప్రకటించి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు, పేదలు తహశీల్దార్ కార్యాలయం ధర్నా చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ

అచ్యుతాపురంలో..

సభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర మాట్లాడుతూ జీడి పిక్కలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా పేదలు, గిరిజనులు సాగులో ఉన్న పోడు పారెస్టు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టి.శంకర్, సిహెచ్ చినదేముడు, ఎం.ఎర్రునాయుడు, జె.ఈశ్వరరావు, సన్యాసరావు, నాగేశ్వరరావు, రాముడు. రాజు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఎంపీడీవో విజయలక్ష్మికి వినత పత్రం అందజేశారు. ఉపాధి హామీ కూలీలకు 8 వారాల నుంచి డబ్బులు చెల్లించకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. సిపిఎం నాయకులు నాయుడు, సాంబశివరావు, ఈశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం పట్టణ కోటవీధిలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పంచాయతీ ఈవో నారాయణరావుకు వినతి పత్రం అందించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వరలక్ష్మి, కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరదేశమ్మ గుడి వెనుక 30 ఏళ్ళనుండి 100 కుటుంబాలు నివసిస్తున్నాయని, అక్కడ విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిపిఎం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్ఠిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో
మీ ప్రకటన
వేయబడును.
మీ సేవలు
మరువలేనివి,
మీరెక్కడున్నా
మీ శ్రేయస్సును
కోరుకుంటాం,
అందించండి.
ప్రజాశక్తి ద్వారా
శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు,
బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా?
అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు,
ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని
ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాదవధార	: 9490099675
పాడేరు	: 9490099142		
రంపచోడవరం	: 9440165617		

న్యాయం చేయరూ...

-30 సెంట్ల భూమికి రూ.97 లక్షలు కాజేత

-ఐదేళ్లుగా ఓ వ్యక్తి మాయమాటలతో

కాలయాపన చేస్తున్నారని దళిత మహిళ ఆవేదన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

30 సెంట్ల భూమిని అమ్మేస్తున్నట్టు, త్వరలో రిజిస్ట్రేషన్ కూడా చేసేస్తున్నట్టు మాయ మాటలు చెప్పి దఫదఫాలుగా తన నుంచి రూ.97 లక్షలను విశాఖ జిల్లా ఆనందపురానికి చెందిన మీసాల అప్పలనాయుడు అనే వ్యక్తి కాజేసినట్టు దళిత మహిళ కుంచంగి లక్ష్మి 'ప్రజాశక్తి' ఎదుట వాపోయింది. 2020 నుంచి ఈ తతంగం నడుస్తున్నా ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదంటూ ఆవేదనకు గురైంది. తనకు చూపించి అమ్మజూపిన భూమిలో పాకలు వేసుకోడానికి వెళ్తుంటే సదరు వ్యక్తి కుటుంబ సభ్యులతో తనపై దాడికి యత్నిస్తున్నాడని పేర్కొంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరింది. తనకు జరిగిన ఆన్యాయం గురించి ఆమె చెబుతూ '2020 జనవరి మొదటి వారంలో చందక గ్రామంలో రోడ్డు పక్కన సర్వే నెంబరు 67/11లో 30 సెంట్ల భూమిని నాకు అమ్ముతానని మీసాల అప్పలనాయుడు పెద్దల సమక్షంలో రూ.97 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. నేను దఫదఫాలుగా అప్పటి నుంచి (నా చేతికి భూ పత్రాలు ఇవ్వకపోయినా) పెద్దలు మధ్యవర్తులుగా ఉన్నందున రూ.97 లక్షలు అప్పలనాయుడుకు ఇచ్చాను. పండగ తర్వాత పేపర్‌లు ఇస్తానని చెప్పి అలా ఏళ్ల దాటించేసి డబ్బులు మొత్తం తీసుకుని చివరకు భూమి పత్రాలు ఇవ్వకుండా మోసం చేశారు. పురోని కూడా నాడు రాయించుకున్నారు. భూమి గురించి నేను అడుగుతుంటే 60 సెంట్ల భూమి ఉందని, ఇచ్చేస్తాని మాయమాటలు చెబుతూ వస్తున్నాడు. పేపర్లు ఇవ్వాలని మొరపెట్టుకున్నా ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాడు. 2021లో భూమి విషయమై నేను నిలదీయగా మూడు నెలల్లో డబ్బులిచ్చేస్తానని రూ.100 స్టాంప్ పేపర్ మీద సంతకాలు పెట్టి కొద్ది నెలల క్రితం ఆ పేపర్ ఇచ్చాడు. పెద్ద మనుషుల సమక్షంలోనే ఈ ఒప్పందం కూడా జరిగింది. ఏళ్ల తరబడి నాకు జరిగిన అన్యాయంపై స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ఇటీవల నా గోడు వెళ్లబోసుకున్నాను' అని లక్ష్మి ఆవేదన చెందుతూ చెప్పింది. ఇటీవల విశాఖ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగలేదని ఆవేదనకు గురైంది. ఆనందపురం పోలీసులు అప్పలనాయుడును పిలుస్తున్నా గైర్హాజరవుతూ వస్తున్నారని తెలిపింది. తనకు ప్రభుత్వం, రెవెన్యూ, పోలీస్ అధికారులు న్యాయం జరిగేలా చూడాలని, రూ.97 లక్షలైనా మీసాల అప్పలనాయుడు నుంచి ఇప్పించాలని, లేదంటే 30 సెంట్ల భూమి అయినా అప్పగించాలని కోరింది.

విధుల పట్ల బాధ్యతగా మెలగాలి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని 22 సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బాధ్యతగా మెలగాలని స్థానిక ఎంపీడీవో ఏవివి కుమార్ దిశా నిర్దేశం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద డిజిటల్ అసిస్టెంట్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధులకు డుమ్మా కొట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సచివాలయంలో 11 రకాల రిజిస్టర్ పట్టికలు క్రమం తప్పకుండా అందుబాటులో ఉంచాలన్నారు. అధికారులు తనకి నిమిత్తం వచ్చినప్పుడు అవసరమైన రిజిస్టర్లు చూపాలని సూచించారు. ప్రతిరోజు 10 కి పైగా ప్రజల నుండి ఆర్జీలు నమోదు చేయించుకోవాలని, ఆధార్ సర్వీస్ పట్టిక బోర్డు గోడ పైకి అతికించాలన్నారు. 1800 మంది చిన్నారులకుఆధార్ అనుసంధానం లేదన్నారు.